TGTEL/25/A0977

# తొవ్వ

స్వేగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 72 | శనివారం 8-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## మెడికోలకు ఊరట!

### 148, 149 జీవోల సంకెళ్ల నుంచి వారంతా బయటకు

### వీటి ప్రకారం రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివితేనే లోకల్

**హైదరాబాద్, నవంబరు 7:** పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికత అంశాన్ని తేల్చేందుకు శాపంగా మారిన 148, 149 జీవోల నుంచి 'ఆ ఎంబీబీఎస్' విద్యార్థులకు ఊరట దక్కనుంది. వాస్తవానికి ఈ జీవోల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారినే స్థానికులుగా పరిగణిస్తారు. ఈ జీవోల ప్రకారం. అల్ ఇండియా కోటా కింద ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులంతా నాన్‌లోకల్ అవుతారు. ఆ మేరకు నీట్‌లో చక్కని ర్యాంకు సాధించి రాష్ట్రం ఆవల ఎయిమ్స్ తదితర ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులంతా ఈ వివాదాస్పద జీవోల ప్రకారం స్థానికేతరులైపోయారు. ఇలాంటి విద్యార్థులకు త్వరలో ప్రారంభం కానున్న పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో అన్యాయం జరగనుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

## ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అంబుజ్‌నాథ్ బోస్ ప్రైజ్

**హైదరాబాద్ సిటీ, నవంబరు 7:** రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్‌కి సంబంధించి '2025 అంబుజ్ నాథ్ బోస్ ప్రైజ్" ఈసారి ఏఐజీ సంస్థల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి దక్కింది. ఎండోస్కోపీ రంగంలో ఆయన చేసిన కృషి, ఆధునిక పరిశోధనలకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిసారి 1998లో డాక్టర్ సి. గోపాలన్ పొందగా, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దీన్ని అందుకున్న రెండో భారతీయుడు. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ (ఆర్‌సీపీ) శాస్త్రీయ విశిష్టత, ఆవిష్కరణలను గుర్తిస్తూ ఏటా నిర్వహించే హార్వేయన్ ఆరేషన్ ద్వారా వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేయాలనే దీర్ఘకాలిక సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమాన్ని 1656లో విలియమ్ హార్వే స్థాపించారు. వైద్య రంగంలో అసాధారణ కృషి, విశిష్ట పరిశోధన చేసిన శాస్త్రవేత్తను సత్కరించడం దీని లక్ష్యమని ఏఐజీ తెలిపింది. వైద్య ఆవిష్కరణలలో నాయకత్వాన్ని ప్రదర్శించిన, ప్రపంచ వైద్య సమాజాన్ని నిరంతరం ప్రేరేపిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి ఏఐజీ ఆస్పత్రి కుటుంబం తరపున ఆ సంస్థ అభినందనలు తెలిపింది.

# నగరాభివృద్ధికి మోదీ, కేసీఆర్ చేసిందేంటి?

## ఏడాదిన్నరలో 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం..

**ప్రగతిభవన్, సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణంతో ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా?**

**నగర విస్తరణకు రూ.వేలాది కోట్లతో ప్రణాళికలు**

**ఏ ఎన్నికనైనా ప్రతిష్ఠాత్మకంగానే తీసుకొంటాను**

**టీడీపీ అభిమానులు బీఆర్ఎస్‌కు ఓటువేస్తారనుకోను**

**చంద్రబాబును అరెస్టు చేస్తే నిరసనలూ వద్దన్నారు**

**బీజేపీకి డిపాజిట్ రాకుంటే హిందువులు ఆ పార్టీతో లేరని బండి సంజయ్ అంగీకరిస్తారా?: సీఎం రేవంత్**

4 లో..



**హైదరాబాద్, నవంబరు 7 :** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ హైదరాబాద్ పాలిట బ్యాడ్ బ్రదర్స్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెట్రోరైలు, గోదావరి జలాలు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీని ఈ బ్యాడ్ బ్రదర్స్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పేందుకు బ్యాడ్ బ్రదర్స్‌తో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ, కేసీఆర్ హైదరాబాద్ అభివృద్ధికి చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కొత్తగా కట్టినవి సచివాలయం, ప్రగతిభవన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరం మాత్రమేనన్నారు. సచివాలయం, ప్రగతి భవన్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లతో నిరుద్యోగులకు కొత్తగా ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా? అని, కాళేశ్వరం ప్రాజెక్టుతో అదనంగా ఒక్క ఎకరాకైనా నీరందించారా? అని ప్రశ్నించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఐటీఐఆర్‌ను మంజూరు చేస్తే.. మోదీ, కేసీఆర్ దానిని రద్దు చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పోగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లలా పని చేస్తూ.. ప్రస్తుతం ప్రభుత్వానికి రూ.లక్షల కోట్ల ఆదాయం రావడానికి కారణమైన ప్రాజెక్టులు, సంస్థలన్నీ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చినవేనన్నారు. నగర అభివృద్ధి కోసం 2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, 2014 నుంచి 2023 వరకు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూసుకుని జూబ్లీహిల్స్ ఓటర్లు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎంలో ఓటమి భయం

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రెఫరెండం కాదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నడు

**ఆయనకు దమ్ముంటే 24 నెలల పాలనను చూపించి.. అప్పుడు ప్రజల తీర్పు కోరాలి**

**హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి**

**సంక్షేమానికి వైఎస్ ప్రాధాన్యం ఇచ్చారు**

**రోశయ్య, కిరణ్ రాష్ట్రం కోసం పనిచేశారు**

**కేసీఆర్ హయాంలో అన్నిరంగాల్లో జోష్**

**రేవంత్‌లాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు**

**జూబ్లీహిల్స్‌లో రోడ్ షోలో కేటీఆర్**

**రేవంత్‌రెడ్డి అట్టర్ ఫ్లాప్ సీఎం**

**బ్లాక్‌మెయిల్ తప్ప పాలన చేతకాదు**

**'మీట్ ది ప్రెస్'లో హరీశ్‌రావు**



**పంజాగుట్ట, నవంబరు 7:** పోలింగ్ కంటే ముందే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని.. అందుకే ఈ ఎన్నిక ఫలితాలు ప్రభుత్వానికి, పరిపాలనకు, తనకు రెఫరెండం కాదని చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్‌కు దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. రెఫరెండం కాదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని స్పష్టమైందన్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేటీఆర్ వెంగళరావు నగర్‌లో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో ప్రజలకు కష్టాలే కనిపిస్తున్నాయని.. సబ్బండ వర్గాలనూ ఆరు గ్యారెంటీల పేరుతో ఆయన మోసం చేశారని ధ్వజమెత్తారు. దుర్యోధనుడి స్థాయిలో డైలాగులు కొట్టిన రేవంత్ 162 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యకు కారణమయ్యారని ఆరోపించారు. రోజుకొకరు చొప్పున ఇప్పటి వరకు 700 మంది రైతులు ఉరి పోసుకునే దుస్థితి తలెత్తిందన్నారు. 'విద్యార్థులు, యువకులు, రైతన్నలు, పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాలను చూసి రేవంత్ రెడ్డికి, కాంగ్రెసకు ఓటు వేయాలా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని.. గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచాక ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము అడిగితే రేవంత్ తనకు సంబంధంలేని కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడమేంటని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోసం రేవంత్ ఎన్టీఆర్ జపం చేస్తున్నారని.. కానీ అసలు కాంగ్రెస్ పార్టీకి ఎన్టీఆర్ పేరు ఎత్తే నైతిక అర్హతేలేదని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా భారీ మెజారిటీతో గెలిచిన ఎన్టీ రామారావును పదవి నుంచి తొలగించిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. శంషాబాద్ విమానాశ్రయానికి పెట్టిన ఎన్టీఆర్ పేరును తొలగించిన ఆ పార్టీ రాజీవ్ గాంధీ పేరు పెట్టిందని గుర్తుచేశారు.

## వందేమాతరం ఆత్మను తొలగించారు

**1937లో కీలక చరణాలు తీసేశారు.. దేశ విభజనకు అదే బీజం వేసింది: ప్రధాని**



4 లో..

**న్యూఢిల్లీ, నవంబరు 7:** జాతీయ గేయం 'వందేమాతరం' స్వాతంత్ర్య సంగ్రామానికి గొంతుకగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్ర్యానంతరం జాతి నిర్మాణానికి మహామంత్రమైందని చెప్పారు. దురదృష్టవశాత్తూ అలాంటి పాట ఆత్మను తొలగించారని.. కీలక చరణాలను తీసివేసి రెండింటినే ఉంచారని కాంగ్రెస్ పార్టీని పరోక్షంగా విమర్శించారు. ఇదే దేశవిభజనకు బీజం వేసిందన్నారు. ఆ విభజన మనస్తత్వం నేటికీ సవాల్ విసురుతోందని తెలిపారు. అక్షయ నవమిని పురస్కరించుకుని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ ఈ గేయాన్ని రాశారు (ఆయన నవల 'ఆనంద మఠ్'లో ఉన్న ఈ పాట తొలుత 'బంగదర్శన్' పత్రికలో దర్శనమిచ్చింది). ఈ గేయం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం నుంచి వచ్చే ఏడాది నవంబరు 7 వరకు ఏడాదిపాటు ఉత్సవాలు నిర్వహించనుంది. వాటిని ప్రధాని శుక్రవారం ఢిల్లీలో ప్రారంభి రారు. ఈ మహామంత్రానికి ఎందుకు అన్యా యం చేశారో తెలుసుకోవలసిన అవసరం నేటి తరానికి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. 'వందేమాతరం అన్ని కాలాలకూ ఉపయుక్తం. మన శత్రువులు ఉగ్రవాదం ద్వారా భారత భద్రతపై దాడికి సాహసించి నప్పుడు.. నవభారతం పది ఆయుధాలు ధరించిన దుర్గగా రూపాంతరం చెందడాన్ని (ఆపరేషన్ సిందూర్) యావత్ ప్రపంచం చూసింది. వందేమాతరం మనకు సరికొత్త స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని ఇస్తుంది. ఇది పదమే కాదు.. మంత్రం.. శక్తి.. ఓ కల.. సంక ల్పం' అని తెలిపారు. బ్రిటిషవారు భారత్‌ను వెనుకబాటుదేశంగా, తక్కువ స్థాయి కలిగిన దేశంగా చిత్రించాలని చూశారని.. కానీ వందే మాతరంలోని మొదటి పంక్తే.. ఈ తప్పుడు ప్రచారాన్ని బదాబదలు చేసిందని చెప్పారు.

# అన్నదాతకు అండ

## ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు 25 వేలకు పెంచాం

- వరదలు, విపత్తులలో ఆదుకుంటున్నాం
- ధాన్యం కొన్న 24 గంటల్లోనే చెల్లింపు
- రాయలసీమలో సబ్సిడీ 'డ్రిప్' పునరుద్ధరణ
- అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు సాయం
- రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- ప్రకృతి సాగుకు అగ్రిటెక్ జోడిస్తే మంచి ఫలితాలు
- ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించండి
- ఆచార్య రంగా 125వ జయంతిలో చంద్రబాబు




**గుంటూరు, నవంబరు 7:** అన్నదాతలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, సాగుకు సాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఒకప్పుడు మన రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉండేదన్నారు. ఇప్పుడు అక్కడ శాంపిల్స్ పరీక్షిస్తూ పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉంటే తిరస్కరిస్తున్నారని అన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంతో ముందుకు పోతున్నామని, దీనికి త్వరలోనే అగ్రిటెక్‌ను జోడించి మంచి ఫలితాలు రాబడతామని చెప్పారు. రైతులు కూడా పురుగుమందులు విక్రయించే దుకాణాల యజమానుల మాటలు వినకుండా అవసరమైతేనే వాటిని వినియోగించాలని కోరారు. ఇప్పుడు డ్రోన్లు వచ్చాయని, వాటితో పంటలపై సర్వే చేయించి ఎక్కడైతే పురుగు సోకిందో అంతవరకే పురుగుమందులు పరిమిత మోతాదులో పిచికారి చేసేలా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. ఈ వేడుకలకు సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మనిషికి తరచుగా ఆరోగ్య పరీక్షలు ఎలా అవసరమో, అలానే భూమికి కూడా సూక్ష్మపోషకాల స్థితిని తెలుసుకొనేందుకు భూసార పరీక్షలు అవసరమని అన్నారు. మిగతా 4లో...

## ప్రైవేటు కాలేజీల సమ్మె విరమణ

**హైదరాబాద్, నవంబరు 7:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గత ఐదురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు కొనసాగిస్తున్న సమ్మెకు తెరపడింది. సమ్మెను విరమిస్తున్నట్లు "ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్" (ఎఫ్ఏటీహెచ్ఐ-ఫాతీ) ప్రకటించింది. గత సోమవారం నుంచి అన్ని కాలేజీలు మూతపడటంతో పలు వర్సిటీల్లో పరీక్షలు వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సచివాలయంలో ఫాతీ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమయ్యారు. ఈ విషయంపై ఇటీవలే ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డి గురువారం సాయంత్రం విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేనతోపాటు అన్ని సంక్షేమ శాఖల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఫీజు బకాయిలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అప్పటికప్పుడే సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి సమ్మె విరమించేలా ఓ నిర్ణయం తీసుకోవాలని సీఎం చెప్పినట్లు తెలిసింది. దీనిపై సుదర్శన్ రెడ్డి శుక్రవారం భట్టితో చర్చించారు. అనంతరం భట్టి, ఫాతీ ప్రతినిధులను చర్చలకు పిలిచి వారితో సమావేశమయ్యారు. మీడియాతో భట్టి మాట్లాడారు. ఫీజు బకాయిల్లో ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదలచేశామని, ఫాతీ ప్రతినిధులు కోరినట్లుగా మరో రూ. 900 కోట్లు త్వరలో విడుదలచే స్తామని అన్నారు. అలాగే ప్రతినెలా బకాయిల్లో ఎన్నోకొన్ని విడుదల చేసేలా ప్రణాళికబద్ధంగా కార్యచరణ అమలుచేస్తామని చెప్పారు.



# చెరువులను కాపాడిన హైడ్రాకు ప్రజల అభినందనలు

## వరద ముప్పు తొలగించిన చర్యలకు ర్యాలీలతో మద్దతు







**హైదరాబాద్, నవంబర్ 07**
హైదరాబాద్‌లో చెరువుల రక్షణ, వరదకాలువల పరిరక్షణలో వేగంగా చర్యలు తీసుకుంటున్న హైడ్రాకు ప్రజలు ఎంతోసంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షం వస్తే వరద ముప్పు తప్పని పరిస్థితి నెలకొనిన పలు కాలనీల ప్రజలు, ఇప్పుడు సమస్యల నుంచి బయటపడినందుకు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. చెరువులను కాపాడుతూ, అక్రమాలను తొలగించి, వరద విపత్తులను అడ్డుకుంటున్నందుకు పౌరులు శుక్రవారం ర్యాలీలు నిర్వహించి మద్దతు తెలిపారు.పలుచోట్ల ప్రజలు చేతపట్టిన ప్లకార్డులు చేసి హైడ్రా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. "చెరువును కాపాడారు, మా వర్షకాల భయాన్ని తొలగించారు, భవిష్యత్ తరాల కోసం నీటి వనరులను నిలబెట్టారు" అంటూ వారు ప్రశంసలు కురిపించారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు ఇంత త్వరగా పరిష్కారం లభించడం తమకు ఊహకు అందలేదని, ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన తీరు ఆదర్శప్రాయమని ప్రజలు అభిప్రాయపడ్డారు. బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీ ప్రజలు గతంలో చిన్న వర్షం పడినా నడుం లోతు నీటిలో ఇళ్లకు చేరాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి వరద కాలువను ఆక్రమించి మార్చడంతో సమస్య తీవ్రమైందని, అయితే హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే హుస్సేన్ సాగర్ ప్రధాన వరదకాలువకు మళ్లీ అనుసంధానం చేయడంతో సమస్య పూర్తిగా పరిష్కరించబడిందని వెల్లడించారు. దీనికి గుర్తుగా స్థానికులు ర్యాలీ నిర్వహించి హైడ్రా చర్యలకు మద్దతు తెలిపారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ ప్రాంతంలోని దేవరయాంజల్ చెరువు వరదకాలువపై కూడా ఇదే తరహా సమస్యను స్థానికులు వివరించారు. ఆరు మీటర్ల వెడల్పుతో ఉన్న నాళాన్ని కేవలం రెండు ఫీట్ల పైపులతో మార్చి ఆక్రమించడంతో వరద నీరు కాలనీల్లోకి చేరి అనేక ఇళ్లను ముంచేసిన సంఘటనలు పునరావృతమయ్యాయని తెలిపారు. అయితే హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే నెలరోజుల్లో సమస్యను పరిష్కరించినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ముష్కిన్ చెరువును కూడా అభివృద్ధి పేరుతో నాశనం చేయడానికి జరిగిన ప్రయత్నాలను హైడ్రా అడ్డుకోవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ముష్కిన్ చెరువు పరిధిలో మట్టి పోసి బండ్ నిర్మించడంతో చెరువు ప్రవాహం నిలిచిపోవడంతో నీటి కాలుష్యం పెరిగి, జీవవైవిధ్యం తగ్గిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెరువు 50ఎకరాల విస్తీర్ణంలో ఉండి, తరతరాలుగా మత్స్యకారుల జీవనాధారంగా కొనసాగేది. కానీ కాలుష్యం వల్ల చేపలు, నీటి నాణ్యత దెబ్బతింది. ప్రజలు ఫిర్యాదు చేయగానే హైడ్రా అధికారులు స్పందించి, పోసిన మట్టిని తొలగించి చెరువు పాత స్వరూపం తిరిగి పొందేలా చర్యలు తీసుకున్నారు. చెరువు సౌందర్యం, సజీవత్వం పునరుద్ధరించబడడంతో మత్స్యకారులు తమ కృతజ్ఞతను వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ, వరద ముప్పును తగ్గించే దిశగా హైడ్రా తీసుకుంటున్న చర్యలు నగర అభివృద్ధిలో కొత్త దిశను చూపుతున్నాయని పౌరసమాజం అభిప్రాయపడుతోంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి నీటి వనరులను కాపాడే చర్యలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# యువ చిత్రకారులకు మరిన్ని అవకాశాలు

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 07**
రాబోయే డిసెంబర్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలంగాణ సమాచార సాంకేతిక, ప్రసార శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ టెలివిజన్ అవార్డులు మరియు యంగ్ ఫిల్మేకర్స్ అవార్డుల కోసం కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. సినీ, టెలివిజన్ రంగాల్లో సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడం, యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. "సృజనాత్మకతకు వేదికలు పెంచడం ద్వారా కొత్త ప్రతిభలను వెలికితీయడం, వారికి జాతీయ–అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే మార్గాలను సమకూర్చడం మా ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ రంగంలో తెలంగాణ యువత దేశవ్యాప్తంగా ప్రతిభను నిరూపిస్తోందని, ఈ ఉత్సవం ద్వారా వారికి ప్రపంచ సినిమా వేదికతో అనుసంధానం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. టీవీ అవార్డులు, యువ చిత్రకారుల అవార్డులు నిష్పక్షపాతంగా, ఉన్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు కమిటీలను నైపుణ్యం కలిగిన వ్యక్తులతో ఏర్పాటు చేసినట్లు తెలిపాయి. రాజకీయంగానే కాకుండా, సాంస్కృతిక రంగంలోనూ తెలంగాణ ప్రతిభ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి తెలిపారు.

# వందేమాతరం భావాలకు అనుగుణంగా దేశాన్ని వికసించాలి

## జాతీయ గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రపతి సందేశం



న్యూఢిల్లీ, నవంబర్ 07
జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వేళ, దేశప్రజలు ఈ గీతం సందేశానికి కట్టుబడి, భారతమాతను "సుజలాం–సుఫలాం–సుఖదం"గా నిలబెట్టాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. వందేమాతరం జన్మించిన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేస్తూ, ఈ గీతం భారతీయుల భావోద్వేగాలకు, జాతీయ ఐక్యతకు శాశ్వత ప్రతీకగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. వందేమాతరం రచయిత బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సన్యాసి తిరుగుబాటు నేపథ్యంలో ఈ అమరగీతాన్ని సృష్టించారని రాష్ట్రపతి వివరించారు. 1905 స్వదేశీ ఉద్యమం నుంచి ఈ గీతం ప్రజల్లో దేశభక్తి జ్యోతి రగిలించిన శక్తిగా నిలిచిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం తర్వాత వందేమాతరాన్ని దేశం జాతీయ గీతంగా గౌరవంగా స్వీకరించింది. దేశ ఐక్యతను ప్రకటించే శక్తి ఈ గీతంలో ఉంది. 150 ఏళ్ల పర్వదినాన మనం అందరం ఈ గీతం భావాలకు అనుగుణంగా దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంకల్పించాలి అని రాష్ట్రపతి సందేశంలో పేర్కొన్నారు. వందేమాతరం భారతీయుల హృదయాలను ఉద్యమపరచిన గీతమని, దేశభక్తి, త్యాగం, ఐక్యత విలువలను తరతరాలకు చేరవేసే బాధ్యత మనందరిదని ఆమె సూచించారు. దేశప్రజలు వికసిత భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్రను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# మహిళా వరల్డ్ కప్ వీరాంగన శ్రీచరణికి సీఎం చంద్రబాబుతో భేటీ

## - మిథాలీ రాజ్ సహా సత్కారం



**అమరావతి, నవంబర్ 07**
మహిళా క్రికెట్‌లో భారత జట్టుకు చారిత్రక విజయం తెచ్చిన వరల్డ్ కప్ బృంద సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ గర్వకారణమైన శ్రీచరణి నేడు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారత మహిళా క్రికెట్ జట్టును ఎన్నో విజయాల దిశగా నడిపించిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఈ సందర్భంలో హాజరై అభినందనలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఐటీ, క్రీడల శాఖ మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీచరణి విజయం దేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు అపార గర్వం తీసుకువచ్చిందన్నారు. "శ్రీచరణి విజయంతో భారత క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయం రాశారు. రాష్ట్రంలోని ప్రతీ బాలికకు ఈ విజయం స్ఫూర్తి కావాలి. మా ప్రభుత్వం మహిళా క్రీడాకారిణులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుంది" అని సీఎం చెప్పారు. శ్రీచరణి వరల్డ్ కప్‌లో చూపిన ఆత్మవిశ్వాసం, అత్యుత్తమ బౌలింగ్ నైపుణ్యం, కీలక సమయాల్లో జట్టుకు అందించిన ప్రదర్శన దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే. ఆమెతో పాటు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ సూచించిన మహిళా క్రికెట్ అభివృద్ధి చర్యలను సీఎం ఆసక్తిగా తెలుసుకున్నారు. అభివృద్ధి పథకాలు, స్టేడియమ్ సదుపాయాల విస్తరణ, యువతకు క్రికెట్ కోచింగ్ సౌకర్యాల పెంపు తదితర అంశాలపై కూడా ఈ భేటీ సందర్భంగా సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో మహిళా క్రికెట్‌కు మరిన్ని వనరులు, అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతుందని వర్గాలు వెల్లడించాయి. శ్రీచరణి రాష్ట్రానికి చేరుకున్నప్పటి నుంచి లభిస్తున్న ప్రజాదరణ, సత్కారాలు ఆమెకు మరింత ఉత్సాహం నింపుతున్నాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# చేవెళ్ల బాధితులను పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కవిత



**తొవ్వ, ప్రతినిధి. నవంబర్ 08**
చేవెళ్ల బస్సు ప్రమాదంలో గాయపడి చేవెళ్లాలోని పీఎంఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

# సొంత చెల్లి, మాగంటి తల్లిని మోసం చేసిన చరిత్ర మీది

## కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, నవంబర్ 07 :**
బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై తెలంగాణ మంత్రి సీతక్క ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఇటీవల వీరు చేసే వ్యాఖ్యలు, రాజకీయ చురుకుదనం చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటమి భయమైందని స్పష్టమవుతోందని సీతక్క వ్యాఖ్యానించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, కేటీఆర్ వ్యక్తిగత వ్యవహారాలు, బీఆర్ఎస్ పాలన, హరీశ్ రావు ప్రచారం శైలిని లక్ష్యంగా చేసుకున్నారు.

"కేటీఆర్ తన సొంత చెల్లి, మాగంటి తల్లిని కూడా మోసం చేశాడు. 91 ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన అవమానం విచారకరం. మాగంటి తల్లి ఆరోపణలపై కెసిఆర్ స్పందించాలి. తెలంగాణ మహిళలు ఇవన్నీ గమనిస్తున్నారు" అని ఆమె అన్నారు. హరీశ్ రావుపై కూడా సీతక్క విమర్శలు కొనసాగించాయి. "నిశ్శబ్ద విప్లవం అంటూ ఆయన భారీగా చెప్పిన మాటలు 2023 ఎన్నికల లోనే ముంచేశాయి. నిన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న హరీశ్ రావు, ఇప్పుడు ఓటమి భయంతో హడావుడిగా ప్రచారంలోకి వచ్చారు" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలను గుర్తుచేస్తూ సీతక్క మాట్లాడుతూ, "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాలతో రాష్ట్రం దెబ్బతింది. ప్రజలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని పాలన కేసీఆర్‌ది. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ప్రజలకే తిరిగి అందిస్తోంది" అని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఫలితాలు చూపిస్తోందని సీతక్క పేర్కొన్నారు. "ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీతో ప్రజలకు ఊరట కలుగుతోంది. హైదరాబాద్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల గత పదేళ్లలో నగరం వరదలతో ఇబ్బంది పడింది. దీనికి కారణం బీఆర్ఎస్ పాలన పద్ధతి" అని ఆరోపించారు. సీతక్క చేసిన ఈ వ్యాఖ్యలు ఎన్నికల రాజకీయాలకు మరింత వేడి పుట్టించనున్నాయని, ఇదే అంశంపై బీఆర్ఎస్ నాయకుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందో ఆసక్తిగా మారింది.

# యూసుఫ్‌గూడాలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు

## - బీఆర్ఎస్, బీజేపీ నేతలకు పొన్నం ప్రభాకర్ కండువా కప్పి స్వాగతం



**హైదరాబాద్, నవంబర్ 07:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడా డివిజన్ వెంగల్‌రావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. స్థానిక నాయకులు సంజయ్ గౌడ్, ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో చేరిన నేతలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల మద్దతు కాంగ్రెస్ వైపు మరింతగా పెరుగుతుందనే దీనికి ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, శివసేన రెడ్డి, బెల్లయ్య నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో వడ్డెరల శక్తి ప్రదర్శన

- ప్రజాపాలన తెచ్చాం
- ఉపఎన్నికలతో అభివృద్ధికి కొత్త వేగం
- నవీన్ యాదవ్ గెలుపుతో 4 వేల ఇందిరమ్మ ఇండ్ల హామీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 07**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతున్న వేళ, బోరబండలో నిర్వహించిన వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం కాంగ్రెస్‌కు ఊపు తీసుకొచ్చింది. వేలాదిగా వడ్డెర కుటుంబాలు హాజరై నవీన్ యాదవ్‌కు గెలుపు ఖాయం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. సభా ప్రాంగణం ప్రజాస్వామ్య నినాదాలతో మార్మోగగా, వడ్డెర సంఘం నాయకులు ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడం విశేషం. సమ్మేళనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు అనసూయ దనసరి (సీతక్క), మహమ్మద్ అజారుద్దీన్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, వడ్డెర సంఘాల ప్రముఖులు, స్థానిక నేతలు హాజరయ్యారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ పొంగులేటి, గత పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "పదేండ్లు పేదలను విస్మరించిన రావణాసుర పాలనను గద్దె దించి, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం పదవిలోకి వచ్చిన తర్వాత సమానత్వంతో పాలన సాగిస్తూ, సంక్షేమాన్ని ఇంటికింటికి అందిస్తోంది" అని వ్యాఖ్యానించారు. నవీన్ యాదవ్ ప్రజలకు చేరువైన నాయకుడని పొంగులేటి కొనియాడారు. "గత మూడుసార్లు ఎన్నికల్లో ఓడినప్పటికీ ప్రజలను విడిచిపెట్టలేదు. ప్రాంతంలోనే ఉండి పేదల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజాభిమానాన్ని సంపాదించారు. స్థానికుడు, యువకుడు, సేవాభావంతో పనిచేసే నాయకుడు నవీన్ యాదవ్‌ను ఈసారి గెలిపించడం జూబ్లీహిల్స్ ప్రజల బాధ్యత" అని పిలుపునిచ్చారు. ఉపఎన్నికల అనంతరం అమలు చేయబోయే ప్రణాళికలను కూడా ఆయన వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నాలుగు వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టితో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ ఇండ్లలో అర్హులైన పేద వడ్డెర్లకు ప్రాధాన్యతనిస్తూ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కేవలం పత్రాల మీద కాకుండా, ఇంటి కలను నిజం చేసే విధంగా ప్రభుత్వం పారదర్శకంగా పంపిణీ చేస్తుందన్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ పరిధిలో పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యలను ఆయన వివరిస్తూ, 18 వేల కొత్త రేషన్ కార్డులను జారీ చేశామని, మరో 19 వేల మంది పేర్లను చేర్చినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వడ్డెరల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఉద్యోగాలు, విద్య, వృత్తి అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో వడ్డెర్లకు ప్రత్యేక అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "నవంబర్ 11న జరగనున్న ఉపఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేయడం ద్వారా పేదల భవిష్యత్తును బలపరచండి. ప్రజాప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాలి. జూబ్లీహిల్స్ అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడుతుంది" అంటూ పొంగులేటి పిలుపునిచ్చారు. సమ్మేళనం ముగిసిన తర్వాత మంత్రులు స్థానిక వడ్డెర కాలనీలను సందర్శించి కుటుంబాలతో మాట్లాడారు. వడ్డెర ప్రజల్లో కాంగ్రెస్‌పై గట్టి నమ్మకం నెలకొన్న వాతావరణం స్పష్టంచేసింది.

# ఓటుకు రూ.3 వేలు!

**రూ. 2 వేల చొప్పున ఇస్తామని ఓ పార్టీ హామీ**

**రూ.వెయ్యి పెంచి ఇస్తున్న మరో పార్టీ.. ప్రచారం ముగియక ముందే పంపిణీ**

**బూత్‌ల వారీగా ఓట్ల కొనుగోలు షురూ.. జూబ్లీహిల్స్‌లో హీటెక్కిన ప్రచారం**




**హైదరాబాద్ సిటీ, నవంబరు 7**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్ల కొనుగోలు మొదలైంది. ప్రచార పర్వం ముగియక ముందే పార్టీలు బూత్‌ల వారీగా ఓటర్లకు డబ్బు పంపిణీ ప్రారంభించాయి. ఓ ప్రధాన పార్టీ ఏకంగా ఓటుకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తుండడం గమనార్హం. మొన్నటి వరకు ఓటుకు రూ.2 వేల చొప్పున ఇస్తామంటూ ఓ ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి హామీ ఇచ్చారు. అయితే ఈ విషయం తెలుసుకున్న మరో ప్రధాన పార్టీ బూత్ ఇన్‌చార్జి దానికి రూ.వెయ్యి పెంచి రూ.3 వేల చొప్పున పంచుతున్నారు. సాధారణంగా ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత.. రాజకీయ పార్టీలు గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను కలిసి డబ్బు, మందు పంపిణీ చేస్తుంటాయి. కానీ, ఈసారి మాత్రం ముందుగానే మొదలుపెట్టేశాయి. ప్రచారం ముగిశాక డబ్బు పంపిణీకి అడ్డంకులు వస్తాయనే ఉద్దేశంతో ముందుగానే అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఓవైపు పోలీసుల తనిఖీలు, మరోవైపు ఎన్నికల స్క్వాడ్‌లు ఆయా పార్టీల ముఖ్యనేతల ఇళ్లలో సైతం సోదాలు చేస్తున్నాయి. దీంతో ప్రచా రం సాగుతుండగానే.. డబ్బు పంపిణీ కూడా కానిచ్చేస్తున్నారు. ఇందుకోసం బూత్‌ల వారీగా ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో స్థానిక కార్యకర్తలతోపాటు జిల్లాల నుంచి వచ్చినవారు సమన్వయం చేసేలా ఇన్‌చార్జులను నియమించారు. వీరి ద్వారా బూత్‌ల వారీగా ఆయా ప్రాంతా ల్లో, అపార్ట్‌మెంట్లలో, ఇళ్లలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. బూత్ కమిటీలతో కలిసి ఆయా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రచారం మరింత హీటెక్కింది. యూసుఫగూడలోని ఓ బస్తీలో నాలుగంతస్తుల భవనంలో నాలుగు కుటుంబాలు ఉండగా, అందులో రెండు కుటుంబాలకు మాత్రమే ఓ బూత్‌లో ఓట్లున్నాయి. రెండు రోజుల క్రితం ఓ ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి ఆ కుటుంబాలను కలిశారు. ఓటు కు రూ.2 వేల చొప్పున పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఇస్తామని మాట ఇచ్చారు. ఆన్‌లైన్‌లో యూపీఐ పేమెంట్‌కు అవకాశం కలిగిన ఫోన్ నంబర్లు సైతం తీసుకున్నారు. ఈలోపు శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి ఆ కుటుంబాలను కలిశారు. ఒక్కో ఓటరుకు రూ.3 వేల చొప్పున పంపిణీ కూడా చేశారు. ఒక కుటుంబంలో నాలుగు ఓట్లు ఉండగా రూ.12 వేలు ఇచ్చారు. మరో కుటుంబంలో రెండు ఓట్లు ఉంటే రూ.6 వేలు చెల్లించారు. తమ పార్టీకే ఓటు వేయాలని వారి నుంచి హామీ పొందారు. కాగా, అదే పార్టీకి చెందిన మరో బూత్ కమిటీ.. రహమత్‌నగర్ డివిజన్ లోని ఓ బస్తీలో ఓటుకు రూ.2500 చొప్పున చెల్లించినట్లు తెలిసింది. దీంతో పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఇస్తామన్న మరో పార్టీ నేతలు.. ముందు చెప్పినట్లుగా ఓటుకు రూ.2 వేలే ఇస్తారా? వారు కూడా 'రేటు' పెంచుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. కానీ, తొలుత రూ.2 వేలు ఇస్తామన్న పార్టీవైపు మొగ్గుచూపిన ఓటర్లు.. మరో పార్టీ రూ.3 వేలు ఇస్తుండడంతో పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరపున ఊపందుకున్న ప్రచారం

- అర్చకులు, నాయి బ్రాహ్మణులు, సంఘాల మద్దతు
- కార్యకర్తల చేరికలు వేగం - నవీన్ యాదవ్ గెలుపు ఇక ఆపలేనిది : పొంగులేటి





**హైదరాబాద్, నవంబర్ 07**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం శుక్రవారం మరింత ఊపందుకుంది. బోరబండ, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో అర్చకుల సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు, పలు అసోసియేషన్ ప్రతినిధులు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడం పార్టీకి బలం చేకూర్చింది. ప్రజల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల పెరుగుతున్న విశ్వాసమే ఈ సామూహిక మద్దతుకు నిదర్శనమని స్థానిక నేతలు అభిప్రాయపడ్డారు. సంఘాల మద్దతు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. "ఈ ఉపఎన్నికల్లో ప్రజాదరణ కాంగ్రెస్ వైపే వెళుతోంది. నవీన్ యాదవ్ గెలుపును ఇక ఎవరు ఆపలేరు. విజయం తథ్యం" అని ధీమా వ్యక్తం చేశారు. గత 22 నెలలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవ్వడంతోనే పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

ఇక జూబ్లీహిల్స్‌లోని రహమత్ నగర్ డివిజన్‌కు చెందిన పలు రాజకీయ పార్టీల కార్యకర్తలు కూడా ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పొంగులేటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలు ఉపఎన్నికల ఫలితాల దిశ ప్రజాభిప్రాయం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిందనీ స్పష్టంగా సూచిస్తున్నాయని పార్టీ నేతలు అన్నారు. పొంగులేటి మాట్లాడుతూ, "ప్రజలకు చేరువలో ఉండాలని, వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది. సంక్షేమం ఇంటికింటికి చేరడం వల్ల ప్రజల్లో నమ్మకం పెరిగింది. జూబ్లీహిల్స్ ప్రజలు ఈసారి కాంగ్రెస్‌కే తీర్పు ఇవ్వబోతున్నారు" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫయుద్దీన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హస్తం గుర్తుకు మద్దతు పలుకుతూ వాతావరణం ఉత్సాహంగా మారింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇంట్లో ఎన్నికల అధికారుల సోదాలు

**అక్రమ కేసులు పెట్టాలనే ఉద్దేశంతోనే: రవీందర్‌రావు**

**సోదాల్లో ఎలాంటి నగదు లభించలేదు: అధికారులు**



**కూకట్‌పల్లి, నవంబరు 7:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం నేపథ్యంలో ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్, సీఐఎస్‌ఎఫ్, పోలీసు సిబ్బంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కినపల్లి రవీందర్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన అద్దెకు ఉంటున్న హైదరాబాద్ మూసాపేట్‌లోని మాజీ ఎమ్మెల్యే మద్రి జనార్ధన్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం ఈ తనిఖీలు జరిగాయి. సోదాలు జరిగే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులను ఇంట్లోకి అనుమతించకపోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దృష్ట్యా భారీగా నగదు నిల్వ ఉంచారనే ఫిర్యాదుతోనే ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి నగదు లభించలేదని సర్చ్ మెమో రిపోర్టులో పేర్కొన్నారు. కాగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటే కూకట్‌పల్లిలో సోదాలు ఎలా నిర్వహిస్తారని ఎమ్మెల్సీ తక్కినపల్లి రవీందర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తనపై అక్రమ కేసులు బనాయించాలనే దురుద్దేశంతోనే సోదాల పేరుతో తనపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరూ లేని సమయంలో తమ ఇంట్లోకి ఎలా వెళ్తారని మాజీ ఎమ్మెల్యే మద్రి జనార్ధన్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఇంట్లోకి తమను కూడా వెళ్లకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తమ ఇంట్లో దుస్తులు తప్ప ఏమీ లేవన్నారు.

# స్వదేశీ ప్రతిజ్ఞతో జాతీయ గర్వాన్ని పునరుద్ఘాటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**- వందేమాతరం నినాదం హైదరాబాదు విమోచనకు జ్వాలను వెలిగించింది**





**హైదరాబాద్, నవంబర్ 07**
హైదరాబాదు విమోచన యోధుల త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి శుక్రవారం "వందే మాతరం" నినాదం దేశభక్తిని మేల్కొలిపి, నిజాం పాలన నుంచి హైదరాబాదును విముక్తి చేయడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఆ నినాదం జాతి గర్వాన్ని రెచ్చగొడి, స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులకు అపార ధైర్యం నింపిందని గుర్తుచేశారు. దేశమాత విమోచన కోసం అంకితభావంతో పోరాడిన వీరులందరికీ తల వంచి నివాళి అర్పిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు డాక్టర్ కే. లక్ష్మణ్, డీకే అరుణ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నట్టం రాంచందర్ రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కిషన్ రెడ్డి స్వదేశీ ప్రతిజ్ఞ స్వీకరించారు. స్వావలంబన, ఆత్మనిర్భర భారత్ భావజాలానికి కట్టుబడి ఉండాలని, దేశీయ ఉత్పత్తుల ప్రాధాన్యతను పెంపొందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

దేశ ఆర్థిక, సాంస్కృతిక స్వాతంత్ర్యం కోసం స్వదేశీ భావజాలం మరింతగా బలపడాలి అని పేర్కొన్న కిషన్ రెడ్డి, "ఆత్మనిర్భరత కేవలం ఆర్థిక విధానం కాదు, అది దేశభక్తి పట్ల మనకున్న బాధ్యత" అని అన్నారు.

# నగరాభివృద్ధికి మోదీ, కేసీఆర్ చేసిందేంటి?

(మొదటిపేజీ తరువాయి)

**8 లక్షల కోట్ల అప్పులు చేశారు..**

రూ.69 వేల కోట్ల అప్పులు, రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. పదేళ్ల పాలనలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి తమకు అప్పగించారని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకువచ్చిన విమానాశ్రయం, మెట్రోరైలు, నాలెడ్జ్ సెంటర్, హైటెక్ సిటీ, ట్రిపుల్ ఐటీ వంటి గొప్ప గొప్ప ప్రాజెక్టులు, సంస్థలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో వచ్చినవేనన్నారు. మోదీ, కేసీఆర్, కిషన్‌రెడ్డి, కేటీఆర్ చేసిందేంటని ప్రశ్నించారు. వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం నుంచి కిషన్‌రెడ్డి చిల్లిగవ్వ కూడా తేలేదని విమర్శించారు. సచివాలయంలో దేవాలయాన్ని, మసీదును కేసీఆర్ ప్రభుత్వం కూలగొడితే.. స్థానిక ఎంపీ అయి ఉండీ కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రగతి భవన్ కేసీఆర్ సేదదీరేందుకు ఉపయోగపడిందని, కొడుకు సీఎం కావడం కోసం వాస్తును సరిదిద్దేందుకు సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్.. సీసీ కెమెరాలతో ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. ప్రాణభయంతో తనను తాను కాపాడుకునేందుకు ప్రగతి భవన్‌లో కేసీఆర్ బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్‌లు కట్టుకున్నారన్నారని, ప్రస్తుతం అందులో నివాసముంటున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ విషయాన్ని ధ్రువీకరించారని చెప్పారు. బుల్లెట్ ప్రూఫ్‌ను తొలగిస్తే ఎక్కువ ఖర్చువుతుందని అలాగే ఉంచామన్నారు. ఇక ఢిల్లీలోని సీఎం నివాసాన్నీ బుల్లెట్ ప్రూఫ్ చేశారని, ఢిల్లీ వెళ్లినప్పుడు అందులోనే ఉంటున్న తానే దానికి సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లీ బఠానీలకు అమ్మేసుకుందని ధ్వజమెత్తారు. పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఏం చేశారో కేసీఆర్ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుల నిర్మాణానికి అనుమతులు తెచ్చిందని సీఎం రేవంత్ తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రైల్వే ప్రాజెక్టును, డొమెస్టిక్ ఎయిర్‌పోర్టునైనా తెచ్చిందా? అని ప్రశ్నించారు. డ్రైపోర్టు ఏర్పాటు కోసం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నామని, ఎలీ లిల్లీ లాంటి కంపెనీ బిలియన్ డాలర్ల ఫార్మాలో పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి ఆరు నెలలు పార్లమెంటు ఎన్నికల కోడ్‌తోనే గడిచిందని, మిగిలిన ఏడాదిన్నరలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని అన్నారు. నగర విస్తరణకు రూ.వేలాది కోట్లతో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని కేటీఆర్ డ్రగ్స్‌కు, గంజాయికి అడ్డాగా మార్చారని ఆరోపించారు. "కేటీఆర్ సన్నిహితుడు కేదార్.. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకుని చనిపోలేదా? కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన పార్టీలో కొకైన్ తీసుకున్నవారు దొరికింది నిజం కాదా?" అని రేవంత్ ప్రశ్నించారు. నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేల సహకారంతో మెట్రో, అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. కేటీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డి మూసీ ప్రక్షాళననూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నగరంలోని 695 చెరువుల్లో 44 చెరువులను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని, మరో 127 చెరువులను పాక్షికంగా ఆక్రమించారని సీఎం తెలిపారు. చెరువులను ఆక్రమణల నుంచి విడిపించి పునరుద్ధరిస్తున్నందునే హైడ్రాపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నది బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. గతంలో చిన్న వర్షానికే హైదరాబాద్ మునిగిపోయేదని, హైడ్రాతో ఆక్రమణలను తొలగించినందునే ఇటీవల పడ్డ పెద్ద వర్షాలకు నగరం జలమయం కాలేదని అన్నారు.

**హైడ్రాను బంద్ చేయాలని చూస్తున్న కేటీఆర్..**

హైడ్రాను, డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్‌లను బంద్ పెట్టించాలని కేటీఆర్ కంకణం కట్టుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. నగరంలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన భూములను హైడ్రా కాపాడిందని తెలిపారు. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లపై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించేందుకూ తాము సిద్ధంగా ఉన్నామని, హైడ్రాలో ఏమైనా లోపాలున్నట్లు చూపిస్తే సరిదిద్దుకుంటామన్నారు. పీఎసయూలను అమ్ముకునే అలవాటున్న బీజేపీ.. తాము ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రోను వాల్చుకుంటామని ఊహించి ఉండదన్నారు. దాదాపు రూ.30 వేల కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకు సాధించి పెట్టామని తెలిపారు. ఎల్ అండ్ టీ కంపెనీని బ్లాక్ మెయిల్ చేసి.. మెట్రో దివాళా తీయడానికి కారకులు కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. సినీ కార్మికుల సంక్షేమం గురించి కేటీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని నిలదీశారు. సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకువచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వాలని, భవిష్యత్తులో ఇక్కడ హాలీవుడ్ షూటింగ్‌లూ జరిగే స్థాయికి నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు.

**ముస్లిం టోపీని మోదీ ఎందుకు పెట్టుకున్నారు?**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ.. తలపైన ముస్లింలు ధరించే టోపీ ఎందుకు పెట్టుకున్నారో కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పాలని సీఎం రేవంత్ అన్నారు. తాను ఆచరించేది హిందూమతమని, ఇతర మతాలనూ తాను గౌరవిస్తానని తెలిపారు. ఒక సీఎంగా అన్ని మతాలను సమానంగా చూడడం తన బాధ్యత అని చెప్పారు. వివిధ కార్యక్రమాల్లో ముస్లిం టోపీలు ధరించిన బీజేపీ నేతల టోపీలను బండి సంజయ్‌కి పంపుతానని, ఎందుకు పెట్టుకున్నారో వారిని అడగాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్లు రాకుంటే.. దానిని రిఫరెండంగా తీసుకుని హిందువులు బీజేపీతో లేరని బండి సంజయ్ భావిస్తారా? అని ప్రశ్నించారు.

# అన్నదాతకు అండ

## ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు 25 వేలకు పెంచాం

- వరదలు, విపత్తులలో ఆదుకుంటున్నాం
- ధాన్యం కొన్న 24 గంటల్లోనే చెల్లింపు
- రాయలసీమలో సబ్సిడీ 'డ్రిప్' పునరుద్ధరణ
- అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు సాయం
- రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- ప్రకృతి సాగుకు అగ్రిటెక్ జోడిస్తే మంచి ఫలితాలు
- ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించండి
- ఆచార్య రంగా 125వ జయంతిలో చంద్రబాబు

**గుంటూరు, నవంబరు 7:** అన్నదాతలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, సాగుకు సాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఒకప్పుడు మన రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉండేదన్నారు. ఇప్పుడు అక్కడ శాంపిల్స్ పరీక్షిస్తూ పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉంటే తిరస్కరిస్తున్నారని అన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంతో ముందుకు పోతున్నామని, దీనికి త్వరలోనే అగ్రిటెక్‌ను జోడించి మంచి ఫలితాలు రాబడతామని చెప్పారు. రైతులు కూడా పురుగుమందులు విక్రయించే దుకాణాల యజమానుల మాటలు వినకుండా అవసరమైతేనే వాటిని వినియోగించాలని కోరారు. ఇప్పుడు డ్రోన్లు వచ్చాయని, వాటితో పంటలపై సర్వే చేయించి ఎక్కడైతే పురుగు సోకిందో అంతవరకే పురుగుమందులు పరిమిత మోతాదులో పిచికారి చేసేలా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. ఈ వేడుకలకు సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మనిషికి తరచుగా ఆరోగ్య పరీక్షలు ఎలా అవసరమో, అలానే భూమికి కూడా సూక్ష్మపోషకాల స్థితిని తెలుసుకొనేందుకు భూసార పరీక్షలు అవసరమని అన్నారు. పరీక్షలలో లోపాలు బయట పడతాయని, వాటిని సరి చేసుకుంటే సారవంతమైన భూమి సేద్యానికి అందుబాటులోకి వస్తుందని సూచించారు.




**వైసీపీ హయాంలో సాగు తిరోగమనం**

"రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతుకు స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా ఇబ్బందులున్నాయి. రైతులంతా టెక్నాలజీని అందిపుచ్చుకోవడంపై దృష్టిసారించాలి. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి. ఖర్చులు తగ్గించి ఉత్పత్తి పెంచగలిగితేనే రైతుకు ఆదాయం పెరుగుతుంది. దీనిపై శాస్త్రవేత్తలు, ఎన్‌జీ రంగా శిష్యులు పరిశోధనలు చేయాలి. రైతులను అన్నివిధాలుగా బాగు చేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తలసరి ఆదాయం, జీఎసడీపీలో వ్యవసాయ రంగం వాటా టీడీపీ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉంటుంది. 2014-19లో జీఎసడీపీలో 16.65 శాతం పెరిగింది. ఆ తర్వాత వైసీపీ హయాంలో 10 శాతం తగ్గిపోయే పరిస్థితికి వచ్చింది. 2024-25లో మళ్లీ 15.45 శాతానికి పెంచాం. జీఎసడీపీ పెరిగితేనే రైతుకు ఆదాయం పెరుగుతుంది. 2023-24 ఖరీఫ్, రబీలో 48 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.6 వేల కోట్లు మాత్రమే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం మిగతా మొత్తాన్ని బకాయిలు పెట్టింది. రైతులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. మేము వస్తూనే రూ.1674 కోట్ల బకాయిలు చెల్లించాం. 2024-25లో 55 లక్షలా 79 వేల టన్నుల ధాన్యాన్ని రూ.12,857 కోట్లకు కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు 24 గంటల్లో నగదు చెల్లింపు చేశాం. ఆర్థిక సమస్యలున్నా రైతులకు ఇబ్బంది రాకూడదని వ్యవసాయ ఉత్పత్తులు సేకరించిన 24 గంటల్లోనే నేరుగా బ్యాంకు అకౌంట్లలో నగదు జమ చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

**పంటల బీమాపై దుష్ప్రచారం నమ్మొద్దు**

"వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.7,500 ఇస్తే, ఇప్పుడు రూ.14 వేలు చేశాం. కేంద్రం రూ.6 వేలు ఇస్తున్నది. రెండూ కలిపి రూ.20 వేలు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద ఇటీవలే రూ.3,174 కోట్లు ఇచ్చాం. మరోవైపు ఇటీవల వరదలు వస్తే ఎక్కువగా కౌలు రైతులు నష్టపోయారు. నేరుగా ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కౌలురైతులకే ఇచ్చాం. వరదలు, విపత్తులు వచ్చినప్పుడు రైతులను ఆదుకుంటున్నాం. గతంలో హెక్టారుకు రూ.20 వేల నష్టపరిహారం ఇస్తే, దానిని వైసీపీ ప్రభుత్వం రూ.15 వేలకు తగ్గించింది. ఇప్పుడు మేము రూ.25 వేలకు పెంచాం. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పంటల బీమా కట్టలేదు. పార్లమెంట్‌లో ఒకసారి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ విషయంపై మాట్లాడుతూ.. పంటల బీమా కవరేజీలో మూడేళ్లు రాష్ట్ర వాటా ఎగ్గొట్టిందని చెప్పారు. మేము వస్తూనే పంటల బీమా 95శాతం కట్టాం. మిగిలిన 5శాతం 12లోపు చెల్లిస్తాం. ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా బీమా ఇప్పించే బాధ్యత తీసుకొంటాం. రైతులకు గిట్టుబాటు ధర పడిపోయినప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ఇందుకోసం మామిడికి రూ.249 కోట్లు, పొగాకుకు రూ.273 కోట్లు, కోకోకు రూ.14 కోట్లు, కాఫీకి ఎకరానికి రూ.5 వేలు, మిర్చికి రూ.130 కోట్లు, టమోటాకు రూ.12 కోట్లు, ఉల్లికి హెక్టారుకు రూ.50 వేల చొప్పున రూ.100 కోట్లు కేటాయించాం. రాయలసీమలో గతంలో డ్రిప్ ఇరిగేషన్ ఆపేస్తే ఈ రోజున మళ్లీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, సాధారణ రైతులకు 50 నుంచి 90 శాతం రాయితీ ఇస్తున్నాం" అని వివరించారు.

**పావలా వడ్డీకే రుణాలు**

"కౌలు రైతులు ఒక్కోసారి ఎక్కువ పొలం తీసుకొని అప్పులు చేసి వాటిని తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంత వ్యవసాయం చేయగలుగుతారో అంతే భూమిని కౌలుకు తీసుకోవాలి. ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు. ఆత్మహత్యలు చేసుకోవడం పరిష్కారం కాదు. ప్రతీ విషయంలో అండగా ఉంటాం. రైతులకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చేస్తున్నాం. ప్రభుత్వం తీసుకొన్న అన్ని జాగ్రత్తల వల్ల చెరువులు, రిజర్వాయర్లన్నింటిని 95 శాతం నింపాం. రాష్ట్రంలో 1100 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండగా, 1000 టీఎంసీల నీరు నేడు నిల్వ ఉంది. గత వైసీపీ హయాంలో రిజర్వాయర్ల గేట్లు కూడా రిపేర్లు చేసేవారుకాదు. ఈ రోజున ముందుజాగ్రత్తగా నిధులు ఖర్చు పెట్టి రిపేర్లు చేస్తున్నాం. ఇటీవల మొంథా తుఫాను వచ్చినపుడు టెక్నాలజీని కచ్చితత్వంతో వినియోగించి ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించాం" అని చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు, శాస్త్రవేత్తలు, ట్రస్టీ రామినేని కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**పంజాబ్ నుంచి రోజూ రెండు రైళ్లలో క్యాన్సర్ రోగులు ఢిల్లీకి**

ఒకప్పుడు పంజాబ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశానికి ధాన్యాగారాలుగా ఉండేవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ రెండుచోట్ల నుంచే బియ్యం ఎగుమతి జరిగేవని తెలిపారు. "నేడు ప్రజల ఆహారపు అలవాట్లు మారిపోయాయి. ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉన్న ఆహారాన్ని కోరుకుంటున్నారు. అన్నం తినడం చాలావరకు తగ్గించేశారు. ఇంకోవైపు పంజాబ్ నుంచి నేడు నిత్యం రెండు రైళ్లు క్యాన్సర్ రోగులతో ఢిల్లీకి వైద్య చికిత్సల కోసం వెళుతున్నాయి. ఈ విషయాన్ని అందరూ గమనించాలి" అని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా ప్రజల ఆహారపు అలవాట్లకు తగిన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అందుకే తమ ప్రభుత్వం రాయలసీమని ఉద్యాన హబ్, కోస్తాంధ్రని ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేయనుందన్నారు. అలానే వాణిజ్య పంటల సాగుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

**నాపై ఎన్‌జీ రంగా ప్రభావం**

"రైతు గౌరవం... దేశ గౌరవం. రైతు అభివృద్ధి... దేశ అభివృద్ధి అని ఆచార్య ఎన్‌జీ రంగా తన జీవితాంతం చెబుతుండేవారు. ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు పార్లమెంట్ లోపల, బయట చేశారు. అవన్నీ నాపై ప్రభావం చూపాయి. నేను పీహెచ్‌డీ చేసేటప్పుడు రంగా ప్రసంగాలను స్ఫూర్తిగా తీసుకొన్నాను. 150 ఏళ్ల క్రితం వందేమాతరం గీతం రచించిన రోజు నవంబరు 7. ఆ సంవత్సరం కాకపోయినా అదే రోజున ఎన్‌జీ రంగా పుట్టినరోజు. ఇది యాదృచ్ఛికమైనా ఒక చరిత్ర. స్వాతంత్ర్య సమరయోధుల్లో అగ్రస్థానంలో ఆచార్య ఎన్‌జీ రంగా నిలుస్తారు. ఆయన గుంటూరులోని ఏసీ కళాశాల నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు విద్యను అభ్యసించి ఆర్థిక శాస్త్రంలో పట్టా పుచ్చుకొన్నారు. రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 33 ఏళ్ల వయసులోనే రైతుల ఉద్యమాన్ని నడిపించిన ధైర్యశాలి. 17వ రాజ్యాంగ సవరణను గట్టిగా వ్యతిరేకించి రైతు ప్రయోజనాలను కాపాడిన మహనీయుడు. రంగా ఒత్తిడికి పార్లమెంట్‌లో నెహ్రూనే తలొగ్గేవారు. ఆయన పార్లమెంట్‌లో ఉంటే రైతు హాయిగా నిద్రపోయేవాడన్న నానుడి ఉండేది. అనేక పుస్తకాలు రచించారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా సేవలందించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్‌జీ రంగా, ఆయన సతీమణి భారతిదేవి ఆదర్శంగా నిలిచారు. తాము పిల్లలను కంటే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి బలహీనపడుతుందేమోనని పిల్లల్ని కూడా కనలేదు. ఆ తర్వాత నాగేశ్వరరావు అనే వ్యక్తిని దత్తత తీసుకొన్నారు. ఆయన, నేను ఒకేసారి మంత్రులమయ్యాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# వందేమాతరం..

(మొదటిపేజీ తరువాయి)

దేశాన్ని కేవలం భౌగోళిక రాజకీయ సంస్థగా చూసేవారికి.. దేశాన్ని తల్లిగా భావించడం విస్మయం కలిగించవచ్చు. కానీ భారత్ భిన్న దేశం. ఇక్కడ తల్లి బిడ్డకు జన్మనిస్తుంది.. పోషిస్తుంది.. తన పిల్లలు ప్రమాదంలో ఉంటే.. దుర్మార్గాన్ని సంహరిస్తుంది. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరిన తొలి దేశంగా భారత్ ఖ్యాతినార్జించినప్పుడు.. నవభారతం అంతరిక్షంలోని మారుమూలలకూ వెళ్లినప్పుడు.. ప్రతి భారతీయుడూ గర్వంతో వందేమాతరం అని నినదించాడు. మన ఆడపిల్లలు అంతరిక్షం నుంచి క్రీడల వరకు అన్ని రంగాల్లో అగ్రస్థానానికి చేరినప్పుడు.. వారు గగనతలంలో యుద్ధవిమానాలను నడుపుతున్నప్పుడు.. మనందరం వందేమాతరం అని సగర్వంగా అంటున్నాం' అని చెప్పారు.

**వందేమాతరాన్ని మోసింది కాంగ్రెస్సే : ఖర్గే**

భారత జాతి ఆత్మను మేల్కొలిపిన వందేమాతరం గేయాన్ని సగర్వంగా భుజాన వేసుకుని మోసింది కాంగ్రెస్ పార్టీయేనని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఆర్ఎసఎస్, బీజేపీ మాత్రం దానిని ఆలపించకుండా దూరంగా ఉన్నాయని ఆరోపించారు. జాతీయవాదానికి స్వయంప్రకటిత సంరక్షకులుగా ఇవి తమను తాము ప్రకటించుకుంటాయని... కానీ ఈ రెండూ ఎప్పుడూ ఆ గేయాన్ని ఆలపించలేదని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. 1896లో కలకత్తాలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహంతుల్లా సయానీ అధ్యక్షతన జరిగిన పార్టీ మహాసభల్లో.. ఠాగూర్ మొదటిసారి వందేమాతరం పాటను ఆలపించారని ఖర్గే తెలిపారు. 1937లో కాంగ్రెస్ పార్టీనే వందేమాతరాన్ని జాతీయ గేయంగా గుర్తించిందన్నారు.

# ప్రపంచకప్ స్టార్ శ్రీ చరణి ఫేవరెట్ హీరో ఎవరంటే..

## తెలుగు తేజం చెప్పిన ఆసక్తికర విషయాలు



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించిన యువ స్పిన్నర్, తెలుగు కిరీటం శ్రీ చరణి ఇప్పుడు వార్తల్లో నిలుస్తోంది. కడప జిల్లాకు చెందిన ఈ 21 ఏళ్ల క్రికెటర్ తన అద్భుత ప్రదర్శనతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన ఫేవరెట్ హీరో, వ్యక్తిగత ఇష్టాల గురించి చెప్పిన విషయాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీ చరణి మాట్లాడుతూ – "నేను సినిమాలు చాలా ఇష్టపడతాను. కానీ ఈ మధ్య బిజీ షెడ్యూల్ వల్ల ఎక్కువగా చూడడం లేదు. గతంలో ప్రభాస్ సినిమా ఏది వచ్చినా వదిలేదాన్ని కాదు. ప్రభాస్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, ఎనర్జీ, సింప్లిసిటీ నన్ను బాగా ఇంప్రెస్ చేస్తాయి" అని చెప్పింది. ప్రపంచకప్‌లో టీమిండియా విజేతగా నిలవడంలో శ్రీ చరణి పాత్ర కీలకమైంది. మొత్తం 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీ రేటుతో 14 వికెట్లు పడగొట్టిన ఈ ఆంధ్రప్రదేశ్ యువతి, ప్రతి మ్యాచ్‌లోనూ దూకుడుగా బౌలింగ్ చేసింది. లీగ్ మ్యాచ్, సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాపై ఐదు వికెట్లు తీసి మ్యాచ్‌ను టీమిండియా వైపు మలిచింది. ఈ ప్రదర్శనతోనే ఆస్ట్రేలియా కెప్టెన్ అలిసా హీలీ కూడా ఆమెను "ప్రమాదకరమైన బౌలర్" అంటూ ప్రశంసించింది. ఇక తన వ్యక్తిగత జీవితంపై మాట్లాడుతూ – "నేను మంచి ఫుడ్ లవర్. స్వీట్లు తప్ప మిగిలిన అన్నింటినీ ఇష్టంగా తింటాను. అమ్మ చేతి వంట అంటే ప్రాణం. టోర్నీల కారణంగా ఈ మధ్య ఇంటి భోజనం దొరకడం లేదు. నేను బాగా ఆడకపోతే అమ్మ 'తినకపోవడం వల్లే' అనుకుంటూ ప్రత్యేకంగా వండి పెడుతుంది" అని నవ్వుతూ చెప్పింది. "మైదానంలో నేను ఒత్తిడికి గురికాను. ఒక బంతి బాగా వేయకపోతే, తర్వాతి బంతి మెరుగ్గా వేయాలని ప్రయత్నిస్తా. ఎవరి సలహా అయినా శ్రద్ధగా వింటా, ఎందుకంటే వాళ్లు నా మేలు కోరే చెబుతున్నారు" అంటూ శ్రీ చరణి తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం భారత మహిళా జట్టులో స్థిరమైన స్థానాన్ని దక్కించుకున్న శ్రీ చరణి భవిష్యత్తు స్టార్‌గా ఎదగనుందని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు.

# బ్రహ్మచారి భర్తగా మారితే..



పవన్‌కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హాస్యభరిత చిత్రం 'పురుష'. వీరు వులవల దర్శకుడు. కల్యాణ్ ప్రొడక్షన్స్ పతాకంపై బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల విడుదల చేశారు. 'బ్రహ్మచారి భర్తగా మారాలని నిర్ణయించుకున్న తర్వాత జీవితం యుద్ధభూమిగా మారుతుంది' అనే క్యాప్షన్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. వెన్నెల కిషోర్, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, దర్శకత్వం: వీరు వులవల.

# టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న మోనాలిసా..

## హీరో ఎవరో తెలిస్తే అవాక్కవుతారు..!

కుంభమేళాలో పూసలు అమ్ముతూ సాధారణ జీవితం గడిపిన ఓ అమ్మాయి ఒక్కసారిగా సోషల్ మీడియాలో స్టార్‌గా మారింది. ఆమె పేరే మోనాలిసా. తేనెపట్టు వంటి కళ్లతో, చక్కని చిరునవ్వుతో, అమాయకమైన హావభావాలతో నెటిజన్ల హృదయాలను గెలుచుకుంది. మహాకుంభ్ మేళాలో పూసలు అమ్ముతుండగా ఆమె వీడియోలు వైరల్ కావడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. మధ్యప్రదేశ్‌కి చెందిన మోనాలిసా తన కుటుంబంతో కలిసి మహాకుంభ్ మేళాకు వెళ్లి పూసల దండలు అమ్ముతుండగా కొందరు వ్యక్తులు ఆమెను వీడియో తీయడంతో ఆ వీడియో నెట్టింట వైరల్ అయింది. ఆ క్షణం మోనాలిసా జీవితం మారిపోయింది. ఆమె అందం చూసి నెటిజన్లు ఫిదా అయ్యారు. వైరల్ అయిన కొద్ది రోజులకే బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా మోనాలిసాను గుర్తించి తన సినిమాలో హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు. "ది డైరీ ఆఫ్ మణిపూర్" చిత్రంలో మోనాలిసా నటించి వెండితెరపై అరంగేట్రం చేసింది. చిన్న పాత్ర అయినా ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా మోనాలిసా తెలుగు సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ఆమె 'లైఫ్' అనే పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. 'క్రష్', 'ఇట్స్ ఓకే గురు'



సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న హీరో చరణ్ సాయి సరసన నటిస్తోంది. 'లైఫ్' సినిమా పూజా కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని శ్రీ వెంగమాంబ మూవీస్ బ్యానర్‌పై అంజయ్య విరిగినేని, ఉషా విరిగినేని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కుంభమేళాలో పూసలు అమ్మిన అమ్మాయి ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో స్టార్‌గా మారడం నిజంగా స్ఫూర్తిదాయకం. మోనాలిసా అందం, వినయంతోపాటు ఆమె జీవిత ప్రయాణం ఇప్పుడు యువతకు ఆదర్శంగా మారుతోంది.

# ప్రతి యువకుడి కథ



కథాంశాల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, వినోదాత్మక చిత్రాలకు పెద్దపీట వేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు హీరో శ్రీవిష్ణు. ఈ ఏడాది 'సింగిల్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు.

బుధవారం ఆయన కొత్త సినిమా ప్రకటన వెలువడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైనర్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తారు. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన పోస్టర్ సినిమా కథను ప్రతిబింబిస్తున్నది. 'ఓటీటీ చిత్రం 'అనగనగా'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమా కోసం అద్భుతమైన కథను సిద్ధం చేశారు. మన రోజువారి జీవితంలోని సంఘర్షణ, ఆశలు, ఆకాంక్షలలకు దృశ్యరూపంలా సున్నితమైన భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. వినోదానికి కూడా పెద్దపీట వేస్తున్నాం. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, రచన-దర్శకత్వం: సన్నీ సంజయ్.

# సీక్రెట్ టాస్క్‌లతో హౌస్‌లో హడావిడి ..

## గౌరవ్, రీతూ వాగ్వాదం!



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో ఈ వారం సీక్రెట్ టాస్క్‌ల సంఖ్య పెరగడంతో హౌస్‌లో అల్లకల్లోలం నెలకొంది. హౌస్‌లో ఎవరు రెబల్స్ అనే విషయం గుర్తించలేక మిగతా కంటెస్టెంట్స్ తలలు పట్టుకుంటున్నారు. ఈ వారం దివ్య, సుమన్ శెట్టి రెబల్స్‌గా వ్యవహరిస్తుండగా, వీరి టాస్క్‌లు హౌస్ వాతావరణాన్ని కాస్త హీటెక్కించాయి. మంగళవారం ఎపిసోడ్‌లో దివ్య, సుమన్ ఇద్దరూ కిచెన్‌లో ఉన్న పాల ప్యాకెట్స్‌ని ఎవరికీ తెలియకుండా దాచిపెట్టారు. బుధవారం ఉదయం రేషన్ మేనేజర్ రీతూ పాలు మిస్సింగ్ అయినట్టు గుర్తించడంతో హౌస్‌లో కాసేపు గందరగోళం నెలకొంది. కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న గౌరవ్ సమయానికి ఆమ్లెట్ ఇవ్వలేదని కెప్టెన్ దివ్య, రీతూ ఫైర్ అయ్యారు. గౌరవ్ మాత్రం "స్నానం చేసి రావడం వల్ల కేవలం ఐదు నిమిషాలు లేట్ అయ్యాను" అని చెప్పాడు. కానీ దివ్య, రీతూ అతని వివరణను పట్టించుకోకుండా "ఇకపై కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉండకు" అని నిర్ణయించారు. దీనిపై గౌరవ్ ..రీతూ, దివ్యలకి కౌంటర్ ఇస్తూ "పాలు పోయినా కూడా నన్ను అంటారు ఎందుకు? నేను 24 గంటలు కిచెన్‌లో ఉండలేను. నేను నీ సర్వెంట్ కాదు" అంటూ విరుచుకుపడ్డాడు. హౌస్‌లో ఈ వాగ్వాదం చర్చనీయాంశమైంది. పాలు దాచిన దివ్య మహానటిలా నటించి ఏమీ తెలియనట్టు వ్యవహరించింది. ఆమె టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేయడంతో బిగ్ బాస్ ఫోన్‌లో సీక్రెట్‌గా అభినందించారు. హౌస్ సభ్యులు మాత్రం డిమాన్ లేదా సంజన రెబల్స్ అయి ఉండొచ్చని గెస్ చేస్తూ పొరబడ్డారు. తరువాత బిగ్ బాస్ ఇచ్చిన కొత్త టాస్క్‌లో పింక్, ఆరెంజ్, బ్లూ టీంలు పోటీ పడ్డాయి. చీకటిగా ఉన్న యాక్టివిటీ ఏరియాలో వస్తువులను టచ్ చేసి, స్మెల్ చేసి వాటి పేర్లు చెప్పాలి. భయపెట్టడానికి అక్కడ గోస్ట్ ఎఫెక్ట్స్ కూడా ఉంచారు. చివరికి ఆరెంజ్ టీం విజేతగా నిలిచింది. మొత్తానికి బుధవారం ఎపిసోడ్ మాత్రం ప్రేక్షకులని రంజింపజేసింది అనే చెప్పాలి. బిగ్ బాస్ హౌస్ ఈ వారం సీక్రెట్ టాస్క్‌లతో హీట్ అవుతోంది. రెబల్స్ ఎవరో తెలుసుకునే క్రమంలో కంటెస్టెంట్స్ మధ్య మరిన్ని ఘర్షణలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# కమల్‌హాసన్ నిర్మాణంలో రజనీకాంత్ 173వ చిత్రం



'కూలీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. బుధవారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. 'తలైవర్173' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తారు. 'అరుణాచలం' (1997) తర్వాత రజనీకాంత్-సుందర్ సి కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రమిదే కావడం విశేషం. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించనున్నారు. లెజెండరీ నటులైన రజనీకాంత్-కమల్‌హాసన్ మధ్య ఉన్న దశాబ్దాల స్నేహాన్ని, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునేలా ఈ సినిమా ఉండబోతున్నదని, 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని మేకర్స్ తెలిపారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# మోటార్ వెహికల్ చట్టాలను డ్రైవర్లు, యజమానులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

## కేసముద్రంలో భారీ వాహన యజమానులు డ్రైవర్లకు అవగాహన సదస్సు

### కేసముద్రం సీఐ సత్యనారాయణ



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 07

మోటార్ వెహికల్ చట్టాలను వాహన యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని కేసముద్రం సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కేసముద్రం సర్కిల్ పరిధిలోని గ్రానైట్, గ్రీన్ ఫీల్డ్ హైవే భారీ వాహన యజమానులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ప్రమాదాలు జరుగుతున్న తీరు నేపథ్యంలో చట్టాలపై సమగ్ర అవగాహన కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి డ్రైవర్ రోడ్డు పై వెళ్ళుతున్నపుడు సైనికుడు దేశం బోర్డర్ లో ఎంత జాగ్రత్తగా బాధ్యతతో గస్తి కాస్తాడో అంతే బాధ్యతగా వాహనాలు నడపాలన్ని డ్రైవర్స్ రూరల్ ఏరియా లో వెహికల్ నడుపుతునపుడు చిన్న పిల్లలను చూసి వెహికల్ నడపాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ డ్రైవింగ్ చేస్తే వెహికల్ సిజ్ చేసి కోర్టు లో ప్రొడ్యూస్ చేస్తామని హెచ్చరించారు, అందరూ డ్రైవర్స్ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వెహికల్ ఇన్సూరెన్స్ తప్పక కలిగివుండలని తెలిపారు, వెహికల్ కి ఇన్సూరెన్స్ లేకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ వాళ్ళ ఆక్సిడెంట్ చేసి ఎవరి మరణానికి కారణం ఐనటలైతే వారిపై 104 బి ఎన్ ఎస్ యాక్ట్ ప్రకారం 10 సంవత్సరాలు శిక్ష గల సెక్షన్స్ యందు కేసు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్, నరేష్, నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేష్ బాబు, ఇనుగుర్తి ఎస్ఐ కరుణాకర్, తో పాటు పోలీస్ సిబ్బంది వాహన యజమానులు డ్రైవర్లు తదితరులున్నారు..

# కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తున్న కేంద్ర రాష్ట ప్రభుత్వాల పతనం తప్పదు

### సిపిఐ ( ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు




తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 07

కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పతనం తప్పదని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు అన్నారు. శుక్రవారం అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రావిరాలలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం శ్రామిక శక్తి విముక్తి కోసం ఈ ప్రాంతంలో పోరాటాలు చేసి విప్లవోద్యమంలో అమరుడైన రావిరాల ముద్దుబిడ్డ కామ్రేడ్ సురేష్ ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలన్నారు. పిసా చట్టం ప్రకారం అటవీ సంపద ఆదివాసులకే చెందుతుందని, కానీ పాలకులు ఆ చట్టాన్ని నీరుగారిస్తూ భూస్వామ్య బూర్జువా వ్యవస్థకు కొమ్ముకాస్తున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నక్సలైట్ వ్యవస్థ లేకుండా చేస్తామని ఆపరేషన్ కగార్ పేరుతో తుద ముట్టిస్తుందని, దోపిడీ వ్యవస్థ ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందన్నారు. 6 గ్యారంటీలతో తెలంగాణ రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో స్పష్టత లేదన్నారు. మహిళలకు 2500, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం, ఉపాధి కూలీలకు 12000 నేటికి నోచుకోకపోవడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.. అంతేకాకుండా ఇటీవల మెంతా తుఫాన్ తో నష్టపోయిన పంటలకు ఎకరాకు 20,000 నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. యువత ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, శ్రీను, వీరన్న ,వెంకటేష్ ,స్వామి, సురేష్ తదితరులున్నారు.

# సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కొరకు స్థల పరిశీలించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి.



నర్సంపేట, నవంబర్ 07, తొవ్వ న్యూస్:

నర్సంపేట డివిజన్ సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నిర్మించుటకై నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి స్థల పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగాశాసనసభ్యులు మాధవరెడ్డి మాట్లాడుతూ దాదాపు 28 కోట్ల రూపాయల తోనర్సంపేటడివిజన్లోసమీకృత ప్రభుత్వ కార్యాలయలు సముదాయం ఆర్డీవో,ఎంఆర్ఓ, ఎంపీడీవో, ఏడిఏ ,ఎంఈఓ ,రిజిస్ట్రార్ తరప్రభుత్వకార్యాలయాలు అన్నింటిని ఒకే చోట నిర్మాణం చేసి ప్రజలకు అన్ని కార్యాలయాలు ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ప్రజలకుసౌకర్యంకల్పించనున్నామని అన్నారు .ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్నాయకులుపాల్గొన్నారు.

# అనాధలను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటది,



**మనిషిలో మానవత్వం ఉండాలి,**

**సొమ్ము ఉన్నవానికైనా ఒక్కొక్కసారి పేదవాడి అవసరం ఉంటుంది,**

**సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గంద్రాది సతీష్,**

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 7,**

ప్రతి మనిషి ఆపదలో ఉన్న అనాధలను ఆదుకోవడంలో ఉన్న సంతృప్తి మరే పనిలో ఉండదని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గంద్రాతి సతీష్ అన్నారు, శుక్రవారం మండలంలోని బలపాల గ్రామంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధ ముసలమ్మ సైదమ్మ విషయం ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ కు తెలిసి వెంటనే కురవి ఎస్సై సతీష్ కు సమాచారం అందించగానే హుటా హుటీన ఒక మహిళ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లను తీసుకొని బలపాల గ్రామం వెళ్లి వృద్ధ ముసలమ్మకు మహిళా కానిస్టేబుల్ చేత స్నానం చేయించి నూతన వస్త్రాలు కట్టి అన్నం తినిపించి ముసలమును ఖమ్మంలోని అమ్మ ఫౌండేషన్ లో చేర్పించి మానవత్వాన్ని ఎస్సై చాటుకున్నారు.



## సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గంద్రాతి సతీష్,

పోలీస్ డిపార్ట్మెంట్ లో చేరి 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తొవ్వ దినపత్రిక ఎస్ఐ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొవ్వ దినపత్రిక నిజం నిర్భయంగా రాస్తుంది, అనాధలు పేద ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే తొవ్వా దినపత్రిక ముందు ఉండి అక్షర రూపంలో వారికి సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. పోలీసు డ్రెస్ వేసుకొని పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం అమ్మ ఫౌండేషన్ కు పది వేల రూపాయలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పిసి వీరస్వామి. పి సి రమేశ్. ఉమన్ పిసి శివాని, తదితరులు పాల్గొన్నారు.

# లో ఓల్టేజ్ సమస్య తీర్చడానికే నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 7.

మండల కేంద్రంలో గల కాకతీయ నగర్ కాలనీలో విద్యుత్ లో వోల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యను తీర్చడానికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఏర్పాటు చేసిన అడిషనల్ 100 కేవిఏ ట్రాన్స్ఫార్మర్ ను విద్యుత్ శాఖ డిఈ హీరలాల్ ప్రారంభించారు.దీని వలన బొద్రాయి బజార్,కాకతీయ నగర్ కాలనీ వాసులకు లో వోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా వినియోగదారులతో కలిసి మాట్లాడుతూ వినియోగదారులకు వ్యవసాయ బావుల దగ్గర,ఇళ్లలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ సమస్యల ఏమైనా ఉంటే సంబధిత అధికారికి లేదా విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ హీరలాల్,ఏడిఇ రమేష్,ఏఈ సుమన్,సబ్ ఇంజనీర్ సందీప్,లైన్ ఇన్స్పెక్టర్ ఎండీ.సలీం,సిబంది సురేష్,కాంటాక్ట్ గోపాల్, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరంలో పెరిగిపోతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు



తొవ్వ : 07 నవంబర్ ఎల్బీనగర్ ప్రతినిధి

వనస్థలిపురం పరిధిలోని జెమ్ కిడ్నీ ఆసుపత్రి ముందు మద్యం సేవిస్తున్న కొంతమంది యువకులను, అక్కడి నుండి వెళ్లమని చెప్పిన ఆసుపత్రి రిసెప్షనిస్ట్ విద్యాసాగర్.దీంతో కోపంలో ఆసుపత్రి సిబ్బందిపై కత్తితో దాడి చేసిన దుండగులు. రిసెప్షనిస్ట్ పరిస్థితి విషమంగా ఉండడతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న వనస్థలిపురం పోలీసులు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి...

### కేసముద్రం సిఐ సత్యనారాయణ...



తొవ్వ,కేసముద్రం, నవంబర్ 07: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కేసముద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకుశుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో డిఎస్పి తిరుపతిరావు ఆధ్వర్యంలోరోడ్డు భద్రత వంటి అంశాలపై వాహనాదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ బారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు పూర్తిస్థాయిలో అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి డ్రైవరు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని పేర్కొన్నారు. వాహనాలు నడిపే వ్యక్తులు అతివేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడపడం వలన ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు.అలాగే పట్టణంలోనికి రాత్రి పూట మాత్రమే భారీ వాహనాలకు ప్రవేశం ఉందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని పేర్కొన్నారు.వాహనం నడిపే డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ వాహనాలకు రోడ్ టాక్స్ పర్మిషన్ తో పాటు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుని వ్యక్తులతో పాటు వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్, నెల్లికుదురు ఎస్సై రమేష్ బాబు, ఇనుగుర్తి ఎస్సై కరుణాకర్, కేసముద్రం సెకండ్ ఎస్సై నరేష్ పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ చిలువేరు ఆశీర్వాదం



తొవ్వ,కేసముద్రం, నవంబర్ 07:
కేసముద్రం మున్సిపాలిటీ కేసముద్రం విలేజ్ కి చెందిన వంగాల సునీత-కొమ్మాల్ రెడ్డి దంపతుల కుమారుడు సచిన్ రెడ్డి వివాహము వధువు శ్వేతా రెడ్డి తో న్యూ రాయల్ కన్వెన్షన్ ఎసి డిఐజి బంగ్లా ఎదురుగా పారడైజ్ బిర్యానీ పక్కన సుబేదారి హన్మకొండలో జరుగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని నూతన వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి మధు,యదళ్ళ కరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కంది సుధాకర్ రెడ్డి,బానోత్ శ్రీను, చిలువేరు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్జనలో పోటీ తత్వం పెంపొందించుకోవాలి .

### టి సాట్ జి హెచ్ ఎం ఏ ఆధ్వర్యంలో వార్షిక పోటీ పరీక్షలు.



ఖానాపూర్, నవంబర్ 07, తొవ్వ న్యూస్:
విద్యార్జనలో పోటీ తత్వం కలిగి ఉండాలని, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేలాకృషిచేస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మండల కోఆర్డినేటర్ చరణ్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో టి సాట్-జి హెచ్ ఎం ఏ ఆధ్వర్యంలో సంయుక్తంగా వార్షిక పోటీ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 6-10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకుఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల ద్వారా తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు 55 మంది కి పైగా తమ గైడ్ టీచర్ , ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పోటీలలో మూడు విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులను ఈ నెల 10 వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సోమలక్ష్మి, ఉపాధ్యాయులు రామ్ మోహన రావు, రవీందర్, మోతీలాల్, శశికుమార్, వీరన్న, శ్రీనివాస్, రవికుమార్ లతో పాటు ఎం ఆర్ సి సిబ్బంది మహేందర్ , రమేష్ , శశిధర్ పాల్గొన్నారు.

## వందేమాతర గీతానికి 150 ఏళ్ల మహోన్నత చరిత్ర.

### రాణా ప్రతాప్ రెడ్డి .



నర్సంపేట, నవంబర్ 07 తొవ్వ న్యూస్:
భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం లో వందేమాతర ప్రోగ్రాం జిల్లా కో- కన్వీనర్ వనపర్తి మల్లయ్య ఆధ్వర్యంలో ఈరోజు జాతీయ గీతాన్ని ఆలపించడంజరిగింది. ఈకార్యక్రమానికిముఖ్యఅతిథిగా బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి విచ్చేయడంజరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ రచించిన జాతీయ గేయం 'వందేమాతరం' 2025 నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. 1875 నవంబర్ 7వ తేదీన అక్షయ నవమి పర్వదినం సందర్భంగా దీనిని రచించినట్లు చెబుతారు. ఆయన నవల 'ఆనందమఠ్'లో మొదటగా ఈ గేయం వెలుగు చూసింది. ఈ నవల అప్పట్లో 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ధారావాహికగా వెలువడింది. ఆ తర్వాత 1882లో ఒక ప్రత్యేక పుస్తకంగా వచ్చింది అని అన్నారు భారత్ భారీ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మార్పులకు లోనవుతున్న కాలమది. జాతీయ గుర్తింపు భావన, వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం.. మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా మార్చింది. జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. తర్వాత కొద్ది కాలంలో ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారింది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్.. వందేమాతరం స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని ప్రకటిస్తూ, జాతీయ గీతం జనగణమనతో సమానంగా వందేమాతరానికి గౌరవం ఇచ్చారు అన్నారు.ఈ కార్యక్రమం లో బిజెపి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ జిల్లా కౌన్సిల్ మెంబర్స్ పొదిల్లా రాంచందర్, గంగిడి మహేందర్ రెడ్డి, సినీయర్ నాయకులు శీలంసత్యనారాయణ,ముత్యాల శ్రీనివాస్, పొనుగోటి రవీంద్రచారి,బీజేవైఎం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేవైఎం నియోజకవర్గ మాజీ కన్వీనర్ జూలూరి మనీష్ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్ గౌడ్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శులు కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, మహిళా మోర్చా నాయకురాలు మార్త సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం

### - జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్



తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్ 07:
జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని సమాజం లో జీవన ప్రమాణాలు పెరగడం జీవన శైలి లో మార్పులు రావడం తో అసంక్రమిత వ్యాధులు (ఎన్సీడీఎస్ దీర్ఘ కాలిక వ్యాధులు) పెరుగుతున్నాయని చెప్పారు .బి. పి. షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు గణనీయం గా నమోదు అవుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం, వంశపారంపర్య కారణాలవల్ల ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేస్తూ వీటిలో చాలా కేసులు ఆలస్యంగా గుర్తించబడటంతో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితిలో వుండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కుటుంబాలు ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, బి. పి. షుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమనే భావనలో వున్నారో, అదే విధంగా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవడంలో వుండాలని అన్నారు. దీనికి ఒకే ఒక పరిష్కారం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది అని తెలిపారు. ప్రభుత్వం 18 సంవత్సరాల పైబడిన వారందరికి ఉచితంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని, మీ ఇంటి వద్దకు వస్తున్న ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని, మీ సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ పరీక్షలు చేయబడునన్నారు. మీ వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఏమైనా అనుమానాస్పద లక్షణాలు వుంటే వాటిని వెంటనే మెడికల్ కాలేజీ ఆసుపత్రులలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్స్ కి రిఫర్ చేసి తక్షణమే ప్రత్యేక ఉచిత వైద్య సదుపాయం, అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యంగా మహిళలు మొహమాటం, బిడియంతో వెనుకంజ వేయకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు.

## భీమ లింగాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు నిధులు కేటాయించాలి సిపిఎం డిమాండ్



యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధిబీ నవంబర్ 7
భీమలింగంను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం వెంటనే తగిన నిధులు కేటాయించాలని, ప్రస్తుత భీమ లింగం బ్రిడ్జి పై
ఐ లెవెల్ బ్రిడ్జి వెంటనే నిర్మాణం చేపట్టి శివలింగం వరకు వెళ్లేందుకు నూతన బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.శుక్రవారం రోజున శివలింగం వరకు వెళ్లేందుకు గ్రామస్తులు చందాలు వేసుకొని ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డును పరిశీలించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి పునర్జీవన కార్యక్రమం పేరుతో సంగెం గ్రామానికి వచ్చి సంవత్సరం గడుస్తున్నదని నేటి వరకు భీమలింగం వద్ద ఎలాంటి పనులు చేపట్ట లేకపోయారని అన్నారు. భీమ లింగానికి హై లెవెల్ బ్రిడ్జిని మంజూరు చేశామని ప్రకటన తప్ప ఎలాంటి కార్యచరణ ప్రకటించలేకపోయారని అన్నారు. ఇటీవల జరిగిన కార్తీక పౌర్ణమి ఉత్సవాల పేరుతో గ్రామస్తులు చెందాలను సేకరించి శివలింగానికి వెళ్లేందుకు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారన్నారు నిత్యం అనేకమంది ప్రజలు భీమలింగం మరియు శివలింగాలను చూడడానికి రాకపోకలు కొనసాగిస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఇప్పటికైనా స్పందించి భీమ లింగం ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సిపిఎం శాఖ కార్యదర్శి భీమనబోయిన జంగయ్య, నాయకులు దొడ్డి బిక్షపతి,వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## రామన్నపేట పట్టణ కేంద్రంలో వందేమాతర గీతాలాపన



యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: నవంబర్7
యాదాద్రి జిల్లా రామన్నపేట పట్టణ కేంద్రంలో వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వందేమాతరం అలాపన ఉత్సవాల సందర్భంగా ఈ గేయాని బంకించంద్ర చటర్జి 1875 నవంబర్ 7 వ తేదీన అక్షయ నవమి నాడు రచించారు.ఈ గేయం భారతీయులను ఏకతాటిపైకి తీసుకురావడమే అదే స్ఫూర్తిని రగిలిస్తున్న వందేమతర గేయానికి నేడు 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాచకొండ సీపీ ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఉదయం 10:00 గంటలకు సుభాష్ విగ్రహం సెంటర్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ రామన్నపేట మరియు పోలీస్ సిబ్బంది, తహసిల్దార్, ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్, స్టూడెంట్స్ మరియు సిబ్బంది, ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది, రామన్నపేట మండల ప్రజలు అందరూ కలిసి వందేమాతరం అలాపన చేశారని రామన్న పేట ఎస్ఐ డి నాగరాజు తెలిపారు.



## గౌరవ డాక్టరేట్ పొందిన కండక్టర్ వేణుకు జ్ఞాపిక అందజేసిన డీఎం ప్రసూనలక్ష్మీ.

**నర్సంపేట, నవంబర్ 07, తొవ్వ న్యూస్:**
సామాజిక సేవా రంగంలో ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన కండక్టర్ గొలనకొండ వేణుకు ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ కె. ప్రసూనలక్ష్మీ శుక్రవారం జ్ఞాపికను అందించి అభినందించారు.గత కొన్నేళ్ల నుండి నర్సంపేట డిపోలో కండక్టర్ గా పని చేస్తూనే వేణు సామాజిక సేవా రంగంలో కొనసాగుతూ వస్తున్నారు. అతని సేవలను గుర్తించి ఇటీవల తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వారు ప్రముఖ సినీ నటులు, మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా కండక్టర్ వేణు హైదరాబాదులో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అతను చేసినటువంటి సామాజిక సేవా దృశ్యమాలికల తోటి తయారు చేయించిన భారీ జ్ఞాపికను తోటి సహోద్యోగులు డీఎం ప్రసూనలక్ష్మీ చేతుల మీదుగా వేణుకు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్ కె. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, బొడిగె రాజు, ఎండీ. జానీ



పాషా, ద్యాగల వెంకట్రాంనర్సయ్య, బూర ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, హరిప్రసాద్, మహేష్, రాములు తదితరులు

# వందేమాతరం భారత జాతీయ ఐక్యతా నినాదం

## - కలెక్టరేట్ లో వందేమాతరం సామూహిక గీతాలాపన



మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్ 07:

"వందేమాతరం" భారత జాతీయ ఐక్యతా నినాదం అని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సహ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ... వందేమాతరం గీతాన్ని ప్రముఖ కవి బంకించంద్ర ఛటర్జీ రచించిన విషయం అందరికి తెలిసిందే. ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించింది. వందేమాతరం నినాదం జాతి ఐక్యత నిలబెట్టింది. ఈనాడు ప్రతి భారతీయుడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ జీవిస్తూ ఉన్నాడంటే "వందేమాతరం" నినాదం అని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ప్రతి శ్వాస నేటి పాఠశాలలో మారు మోగుతోంది. సందేహం లేదు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భారతదేశాన్ని ప్రపంచ పటంలో ముందు ఉంచాలని ఆకాంక్షించారు. మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందే మాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ గీతాన్ని సామూహిక గానం చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, హార్టికల్చర్ అధికారి మరియన్నా, బిసి, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, డీఎంసివిల్ సప్లై కృష్ణవేణి, మైన్స్ ఏడి వెంకటరమణ, టీఎన్జీవోస్ జేఏసీ చైర్మన్ వడ్డబోయిన శ్రీనివాస్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, మెప్మా విజయ, విజయ కుమారి, మురళి, ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కొప్పు ప్రసాద్, సక్కుబాయి, కిషోర్, అన్ని విభా%ు%గాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంజేపీ గురుకులంలో ఘనంగా వందేమాతరం గీతలాపన

తొవ్వ ,పఠాన్ చెరు, నవంబర్ 7:





భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి కోట్ల మంది భారతీయుల్లో,స్ఫూర్తి నింపిన వందేమాతరం,జాతీయగీతం అని, భారతీయుల హృదయాల్లో దేశప్రేమను, రగిలించే ఉద్యమ నినాదం,వందేమాతరం, అని బీసీ గురుకుల ఎంజేపీ ఐనోల్, అల్లాదుర్గ్ గురుకుల ప్రిన్సిపాల్ స్రవంతి అన్నారు.శుక్రవారం వందే మాతరం జాతీయ గీతం150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులతో కలసి వందేమాతరం గీతాలాపన చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ.. వందే మాతరం జాతీయ గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంవత్సరం పొడువున అనగా నవంబర్ 7 నుండి 2026 నవంబర్ 7 వరకు స్మారక కార్యక్రమాల ద్వారా వందేమాతరం 150,వసంతాల ఉత్సవాలను జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని,వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ గారు 1875లో రాశారు.వందే మాతరం,అంటే మాతృభూమికి వందనం, అని అర్థం.వందే మాతరం, నినాదం బ్రిటిష్ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఒక స్ఫూర్తి నినాదంగా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖ, ఉపాధ్యాయులు,పీడీ,పిఈటి, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వందేమాతర దినోత్సవం



తొవ్వ,కేసముద్రం, నవంబర్ 07:



దేశభక్తి గీతమైన వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హై స్కూల్ లో వందేమాతర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు సమూహంగా వందేమాతరాన్ని పూర్తిగా ఆరాపించి దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ"వందేమాతరం భారత జాతి ఉనికి, స్వాభిమానం, స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన గీతం. ఇది కేవలం పాట కాదు, ఇది మన జాతి ఆత్మ. బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయులు రాసిన ఈ గీతం ఆజాదీ ఉద్యమంలో దేశమంతా జ్వాలలా వ్యాపించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపింది" అని పేర్కొన్నారు.అలాగే విద్యార్థులు వందేమాతర గీతంలోని ప్రతి పదం వెనుక ఉన్న దేశప్రేమను అర్థం చేసుకోవాలని, దేశభక్తి విలువలను జీవితంలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని రోడ్ల సమస్యలు పరిష్కరించాలి

## ఎంసీపీయూ కేసముద్రం మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిలి

**తొవ్వ,కేసముద్రం, నవంబర్ 07:**



మున్సిపాలిటీ కేంద్రంలో ప్రమాదభరితంగా అడుగు ఒక గుంట ఉందని రోడ్ల సమస్యలు పరిష్కరించాలనీ ఎంసీపీయూ కేసముద్రం మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఈసందర్బంగా కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోనీ మార్కెట్ రోడ్డులో పెద్దమిళ్ళు సమీపంలోని రహదారిపై ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలను కేసముద్రం మండల ఎంసీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈసందర్బంగ మొగిలి మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రం మార్కెట్ రోడ్డులో పెద్దమిళ్ళు సమీపంలోని రహదారిపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అదేవిదంగా మున్సిపాలిటీ కేంద్రంలోనీ గాంధీ బొమ్మ సెంటర్ నుండి దణ్ణసరి క్రాస్ రోడ్డు వరకు, గాంధీ బొమ్మ సెంటర్ నుండి వైయా బస్వరాజ్యం ఇంటి వద్దనుండి పొట్టిశ్రీరాములు సెంటర్ వరకు పెద్ద పెద్ద గుంటలు పడి వాహనాలు పోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అంతే కాకుండా అంబేద్కర్ సెంటర్నుండి విలేజ్ కేసముద్రం దర్గా వరకు రోడ్లన్నీ గుంటల మైయంగా మారి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు పోయందుకు ఇబ్బందులు పడుతున్న అధికారులు కానీ పాలకులు కానీ పట్టించుకున్న పాపానపో లేదన్నారు. గతుకులు పడ్డ ఈ రోడ్లపైనే అధికారులు, పాలకులు ప్రతీ రోజు తిరుగుతున్నారే తప్ప ఇంత ఇబ్బందులుగా ఉన్న రోడ్లను కనీసం మరమ్మత్తులు చేయించాలానే సోయి లేకుండా పోయిందని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి రోడ్లను మరమ్మత్తులు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంసీపీఐ మండల కమిటీ సభ్యులు జాటోత్ భీచ్య నాయక్, ఉల్లి ప్రతాప్, భానోత్ సుధాకర్, సపవత్ లింబా, వంకుడోత్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## 'సహ'చట్టానికి సమాధి

తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 07:

సమాచార హక్కుకు చట్టబద్ధత కల్పించాలంటూ దేశవ్యాప్తంగా పౌర సమాజం స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున డిమాండ్ చేయడంతో 18 ఏండ్ల క్రితం నాటి ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కల్పిస్తూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ప్రజలకు వెల్లడించవచ్చునని తెలిపింది. సెక్షన్ 8(1)నిబంధన ప్రకారం 10 విభాగాలుగా వర్గీకరించిన వివరాలను మాత్రం నిరాకరించవచ్చునని ఈ చట్టం స్పష్టంగా పేర్కొన్నది,'అధికార రహస్యాల చట్టం లేదా మరే చట్టాలైనా నిబంధనల పేరుతో పౌరులకు సమాచారం ఇవ్వకుండా నిరాకరించరాదు'పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 8(1) ను సవరిస్తే సమాచార హక్కు చట్టం స్ఫూర్తి దెబ్బతింటుంది. ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారిన ఈ చట్టం రెక్కలు తెగిన జటాయువుగా మారుతుంది

# ఆరుట్ల గ్రామంలోసామూహిక వందేమాతరం కార్యక్రమం



తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, నవంబర్ 7:

శ్రీ బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం 150 సంవత్సరాలు అయిన సందర్భంలో ఆరుట్ల గ్రామంలోసామూహిక వందేమాతరం గీతాలాపన జరిగినది. ఈ దేశ స్వాతంత్రం కోసం మరి ఒక రననినాదం దీన్ని ఆరోజు భారతదేశాన్ని పరిపాలించేటువంటి బ్రిటిష్ వారిని మరి దేశం నుంచి తరిమి కొట్టాలైనటువంటి సదుద్దేశంతో ఈ యొక్క గీతాన్ని మరి రచించారు రచించి వందేమాతరం అని దానికి నామకరణం చేసి మరి బ్రిటిష్ వారిని పారదోలలో ఒక కీలకమైనటువంటి ఈరోజు ఆరుట్ల గ్రామంలో గౌరవ ఆఫీసర్ గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేష్ఆధ్వర్యంలో గౌరవ ప్రజాసంఘాల నాయకులు కంబాలపల్లి భాస్కర్ గారి ఆధ్వర్యంలో మరి అదేవిధంగా ఈరోజు వివిధ సంఘాల ఆధ్వర్యంలో సామూహిక గీతాలాపన జరిగినది యావత్ భారతదేశం లో ఢిల్లీ నుంచి గల్లి వరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈరోజు ఉదయం 10 గంటల నుండి 15 నిమిషాల వరకు ఈ యొక్క కార్యక్రమం చేయాలని చెప్పేసి భారత ప్రభుత్వం పద అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు కూడా సకాలంలో ఈ యొక్క కార్యక్రమం చేయాలని సంకల్పించినటువంటి సందర్భంలో యావద్ గ్రామంలో ఉన్నటువంటి వాళ్ళందరూ కూడా మరి అంబేద్కర్ చౌరస్తా వద్ద సామూహికంగా గీతాలాపన చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులతోపాటు వివిధ రాజకీయ నాయకులు మరియు మండల మాజీ కోపరేషన్ సభ్యులు ఆజాద్ గ్రామస్తులందరూ పాల్గొన్నారు ప్రజా గళం దామర భూపాల్ లక్ష్మానాయక్ గారు లక్ష్మీ వస్త్రాలయం శ్రీనివాస్ చిందం జంగయ్య గ్రామపంచాయతీ కారోబార్ శంకరయ్య ఆకారం కృష్ణ కూడా పాల్గొని పంబల దాసు రావుల చంద్రయ్య కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినార

# సిరోలు ఎంఈఓ పై చీటింగ్ కేసు నమోదు చేయాలి,

**పేద రైతు భూమిలో సిసి రోడ్లు పోయటం దారుణం,**

**అధికారులను తప్పు దోవ పట్టించడంలో మహా దిట్ట**

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి,**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 7,**

సిరోలు ఎంఈఓపై లచ్చిరాం పై చీటింగ్ కేసు నమోదు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లచ్చిరా%శీ% తండా శివారులో పేద రైతు కంబాల సాయిలు పట్టా భూముల్లో ఎంఈఓ లచ్చిరాం తన కోళ్ల ఫారం కు దారి ఉండాలని దౌర్జన్యంగా సిసి రోడ్లు వేయించుకోవటమే కాక సదరు భూమి యజమానిని బెదిరించటం జరిగిందని క్రిమినల్ మైండ్ అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ప్రభుత్వ ఉద్యోగం నుంచి డిస్మి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సదరు రైతు అధికారులకు విన్నవించుకున్న ఎవరు పట్టించుకోకపోవడం పోలీసుల దగ్గరకు పోయి పిటిషన్ ఇచ్చినా కూడా పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యానికి పాల్పడినట్లు తెలిపారు. ఎంఈఓ అధికారులను తప్పుదోవ పట్టించడంతోటే పేద రైతు ఆత్మహత్యానికి ప్రయత్నించాడని అధికారులు తప్పుగా పట్టించే అధికారిని సర్వీసు నుచి రిమూవ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రి పట్టా భూమిలో సిసి రోడ్డు వేయించుకోవడం రైతు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి ప్రజాధనాన్ని కేవలం తమ సొంత కోళ్ల ఫారం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అధికారుల తప్పుదోవ పట్టించి పట్టా భూమి ఉన్న వ్యక్తిని బెదిరించి సిసి రోడ్డు వేయించడం పై చీటింగ్ మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న ,కొరవి గ్రామ కార్యదర్శి తురక రమేష్, నాయకులు బుడమ వెంకన్న ,కన్నే వెంకన్న, కొలగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు,

## పలు వివాహా వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఏఎంసీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్



తొవ్వ,కేసముద్రం,నవంబర్ 7,:
కేసముద్రం ప్రముఖ వ్యాపారవేత వోలం సమతా దేవి-సతీష్ కుమార్ దంపతుల కుమార్తె సంజన - సూరజ్ ల వివాహ మహొత్సవానికి, అదేవిధంగా వంగాల సునీత-కొమ్మాల్ రెడ్డి దంపతుల కుమారుడు సచిన్ రెడ్డి-శ్వేతా రెడ్డిల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఏం సి మాజీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్ ఈ కార్యక్రమంలో వారి వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్,బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు జాటోత్ హరినాయక్,బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్,ధనసరి మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి రవీందర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి బోడ కవితా రాజేందర్,కన్నెబోయిన శీను,ఉపేందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా వస్తువుల పంపిణి

తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 07:



ప్రాథమిక పాఠశాల కంబాలపల్లి పాఠశాల నందు కీర్తిశేషులు చౌడవరపు వెంకటేశ్వర్లు జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి సతీమణి సుమలత , కుమారుడు సాయి కృష్ణ వారి కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు క్రీడ సామాగ్రిని అందజేశారు . ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి అధ్యక్షత వహించారు. స్ఫూర్తి ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు మరియు వెంకటేశ్వర్లు గారి కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేయడం జరిగింది, వారికి పాఠశాల తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు రామ సహాయం శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి కీర్తిశేషులు చౌడవరపు వెంకటేశ్వర్లు గారు క్రీడలు మరియు చదువుకునే పిల్లలు అంటే వారికి చాలా ఇష్టం అని, ఆ కారణం చేత వారి కుటుంబ సభ్యులు వారి ఆశయాలను కొనసాగించాలని పాఠశాల విద్యార్థి విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించడం జరిగినది విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపాలని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే ఆరోగ్యకరమైన ఆటలు అవసరం అని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు మంచాల రాధాకృష్ణ మంచాల విజయలక్ష్మి కుమార్తె పూజిత అల్లుడు నాగేంద్రబాబు వారి స్నేహితులు చిరంజీవి చీరక ఉపేందర్ రెడ్డి నీలం రమేష్ మరియు గ్రామస్తులు సాబాది మంజుల మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆవునూరి రవి, రాధిక, సువర్ణ, శ్రీజ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఏఐతో చదువులో కొత్త దారి

- విద్యార్థినిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రశంసలు
- టీఫైబర్ వల్లే డిజిటల్ లెర్నింగ్ గ్రామాలకు చేరింది
- అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై ప్రశంసల వర్షం



హైదరాబాద్, నవంబర్ 07 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):
అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సెలవుల్లోనే ఏఐ సాధనాన్ని ఉపయోగించి 9వ తరగతి సిలబస్ మొత్తం పూర్తి చేసి, 10వ తరగతి అర్హతను సాధించడం రాష్ట్ర విద్యా రంగంలో చర్చనీయాంశమైంది. గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థిని చూపిన ఈ నేర్చుకునే తపనను ఐటీ %డ% డిజిటల్ సర్వీసుల శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు ఎంతో ప్రశంసించారు. మంత్రి మాట్లాడుతూ.. టెక్నాలజీని సృజనాత్మకంగా ఉపయోగిస్తే గ్రామీణ విద్యార్థులు ఎంతటి శిఖరాలను అధిరోహించగలరో ఈ విద్యార్థిని నిరూపించిందని అన్నారు. ఆమె ప్రేరణతో ప్రస్తుతం అదే పాఠశాల నుండి మరో 50 మంది విద్యార్థులు కూడా ఏఐ టూల్స్ ద్వారా చదువును కొనసాగిస్తున్నారని వెల్లడించారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "డిజిటల్ లెర్నింగ్ అవకాశాలు అందుబాటులోకి రావడం అంటే టీఫైబర్ ప్రాజెక్టు విజయం. రాష్ట్రంలో గ్రామీణ విద్యార్థులకూ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుతోందంటే, విద్యలో సమాన అవకాశాలు పెరుగుతున్నాయని అర్థం" అని వ్యాఖ్యానించారు.ప్రస్తుతం నాలుగు గ్రామాల్లో టీఫైబర్ పైలట్ ప్రాజెక్ట్ అమలవుతుండగా, అక్కడి విద్యార్థులు ఆన్లైన్ లెర్నింగ్, ఏఐ ఆధారిత విద్యా సాధనాలను సులభంగా ఉపయోగిస్తున్నట్లు మంత్రి వివరించారు. గ్రామీణ విద్యను రూపాంతరం చేయడంలో ఈ మోడల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఏఐ పట్ల ఆసక్తి పెరగడం, ఉపాధ్యాయులూ విద్యార్థులూ టెక్నాలజీతో పాఠశాల దాటిన నేర్చుకునే ప్రయాణాన్ని ప్రారంభించడం రాష్ట్ర విద్యా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## జూ బ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 07:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు విస్తృత ప్రచారం, ప్రతి గల్లీ, ప్రతి ఇంటికి చేరుతున్న కాంగ్రెస్ సందేశం..జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో బోరబండ డివిజన్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో ఉత్సాహం నింపారు పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారు..స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి డోర్ టు డోర్ క్యాంపెయిన్ లో పాల్గొన్న యశస్విని రెడ్డి ప్రతి గల్లీ, ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలను అభివాదం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ఘన విజయవంతం చేయాలని కోరారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు సేవ చేయగల శక్తి కలిగిన పార్టీ. అభ్యర్థి నవీన్ యాదవ్ యువ నాయకుడు, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న నాయకుడు. మీ ఓటు ఆయన గెలుపుతో పాటు ప్రజల భవిష్యత్తుకి కూడా బలం చేకూరుస్తుంది, అని అన్నారు..ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్థానిక వ్యాపారస్తులను, మహిళలను, యువతను కలుసుకుని ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల నుండి మంచి స్పందన లభించింది..కార్యక్రమంలో బోరబండ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నేతలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో ప్రాంతమంతా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది..

## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో అంగరంగ వైభవంగా వందేమాతరం జాతీయ గీతం 150 వసంతోత్సవం



తొవ్వ ,ప్రతినిధి ,నవంబర్ 07:
స్థానిక మహబూబాబాద్ పట్టణ శివారులో గల స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ లో వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అందరూ ముక్తకంఠంతో వందేమాతర గీతాన్ని తనివితీరా ఆలపించి అలరించారు. స్వాతంత్రం సిద్ధించడంలో, ప్రజల్లో దేశభక్తిని ఏర్పరచడంలో, అన్ని మతాల అన్ని కులాల వారిని ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన వందేమాతర గీతం ఒక చరిత్ర. ఈ గీతాన్ని ఆలపించిన ప్రతి ఒక్కరి హృదయాలలో గర్వంతో నిండిన దేశభక్తి ఉంటుందని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ దాసరి మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఎందరో దేశభక్తుల, దేశ నాయకుల, వీరోచితమైనటువంటి పోరాటంలో ప్రభలమైనటువంటి ముద్ర వేసిన ఈ జాతీయ గీతం చాలా ముఖ్యమైనదని, ఈ గీతాన్ని భావితరాలకి స్ఫూర్తిని నింపడానికి ఈ 150 వ వసంతాల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె. చంద్రమౌళి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మువ్వన్నెల జెండా చేతబట్టి 130 కోట్ల భారతీయుల జాతీయగీతమైన వందేమాతర గీతాన్ని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులచే ఆలపించ చేయడం తమ పూర్వజన్మ సుకృతం అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల మనసులలో బాల్యం నుండే దేశభక్తి అనే విలువను గట్టి పునాదిగా ఏర్పడడానికి ఇది ఒక మంచి పరిణామం ఆయన అభిలాషించారు. తరగతి నాలుగోడల మధ్య విద్య మాత్రమే కాకుండా ఇలాంటి సామాజిక విలువలను దేశం గర్వించదగ్గ సైనికులుగా సమాజ పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ సందర్భంగా దేశం గర్వించదగ్గ రచయిత బంకించంద్ర చటర్జీ గారిని ఆయన స్మరించుకుంటూ ,విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా దేశభక్తిని తమ తమ దేహాలలో నరనరాన జీర్ణించుకునే విధంగా చేసుకోవాలని కోరారు. అనంతరం జాతీయ గీతాన్ని సగర్వంగా ఆలపించి జండా వందనం చేశారు. అనేక దేశ జాతీయ నినాదాలతో పాఠశాల ప్రాంగణం కరతాల ధనులతో హెూరోత్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని దేశం గర్వించదగ్గ స్ఫూర్తిని ఈ వందేమాతరం 150 వసంతోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## మాగంటి గోపినాథ్ మరణం పట్ల విచారణ చేపట్టాలని బీజేపీ డిమాండ్

- మిస్టరీ తీర్చాలి.. ఆస్తులు, పంపకాలు, పంపకుల వలనే స్పష్టం చేయాలి"
- కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



తొవ్వ ,హైదరాబాద్, నవంబర్ 07 :
తెలంగాణ బీజేపీ ట్వీట్ ప్రకారం మాగంటి గోపినాథ్ మరణాన్ని అనుమానాలపై తక్షణ విచారణ జరపాలని పార్టీ నేతలు ఖరారు చేసేశారు. పార్టీ రాష్ట్ర ఖాతాలో వెల్లువెత్తుతున్న పిలుపులో, మృతుడి ఆస్తులు, వాటి పంపకాలు ఎవరి పేరుమీదకి వెళ్లాయి, ఎవరికి ఎలా బదిలీ అయ్యాయో స్పష్టంగా రికార్డు చేయాలని దృష్టి పెట్టాలని కోరారు. పార్టీ ట్వీట్లో కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాగంటి గోపినాథ్ తల్లిని ఉద్వేగంలో ఉన్నట్లు చూపిస్తూ, మరణ చుట్టూ ఉన్న అనుమానాలను తీర్చి మరణం పూర్తిగా స్పష్టతతో బయటపడాలని చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఆవేదన, స్థానిక ప్రజల కలిగిన ఆందోళనలను గుర్తిస్తూ, ప్రభుత్వం ప్రమాణిత విచారణ నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది.పార్టీ ప్రకటనలో మృతుని ఆస్తి, పంపకాల లెక్క, వాటిపై ఎవరి హక్కులైతే ఉన్నాయో, అవి ఎక్కడకు వెళ్లాయని తెలియజేయాలని, విచారణ ద్వారా ఏవైనా సాధారణ మార్పులు జరిగాయా లేదా అనేది నిర్ధారించాలన్న అంశాన్ని వేగంగా పూర్వకంగా పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఘటనా పరిస్థితులపై పారదర్శకత లేకుండా ప్రజల్లో అనుమానాలు మాత్రమే పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి తక్షణగా పరిష్కారమవాలని పార్టీ నాయకులు టీవీ, సోషల్ మీడియాలో అంచనా పెడుతున్నారు. సమగ్రంగా విచారణ జరగాలని, ఫలకు సంబంధించి రిపోర్టు ప్రజలకు అందజేయాలని బీజేపీ పిలిపిన ఈ డిమాండ్ పై ప్రాజెక్టు సంబంధిత అధికారుల ప్రతిస్పందన ఇంకా రాలేదని రాజకీయ వర్గాలు తెలిపారు. ఈ వివాదం రాష్ట్ర రాజకీయ వాతావరణంలో కొత్త ఉద్వేగానికి కారణమయ్యింది.

## ప్రతి ఓటు హస్తానికి చేరాలి

- జూబ్లీహిల్స్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

ప్రచారానికి సీఎం రేవంత్ దిశానిర్దేశం - మూడు రోజులు అత్యంత కీలకం

- బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచనలు



తొవ్వ ,హైదరాబాద్, నవంబర్ 07 :
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రచారంలో పాల్గొంటున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు పార్టీ నేతలకు ఆయన ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. రాబోయే మూడు రోజులు అత్యంత కీలకమని, ఈ వ్యవధిలో ఇంటింటికీ చేరి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, సంక్షేమం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ వ్యాప్తి చేస్తున్న "తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి" అని నాయకులను ఆదేశించారు. ప్రజల్లో నిజమైన సమాచారాన్ని చేరవేసి, కాంగ్రెస్ తీసుకువస్తున్న మార్పును వివరించాల్సిన అవసరం ఉందన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు అవుతున్నాయి. దీన్ని ప్రతీ ఇంటికి స్పష్టంగా చెప్పాలి" అని చెప్పారు. మహిళల ఓటు కీలకమని హైలైట్ చేసిన రేవంత్, గత ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో మహిళల పాత్రనే ప్రధాన శక్తి అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఒక్క మహిళా ఓటు కూడా వృథా కాకుండా చూడాలని సూచించారు. మహిళలలో కాంగ్రెస్పై విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రత్యేక ప్రచారం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. , ముఖ్యంగా యువత, మహిళలు, కొత్త ఓటర్లను ఓటింగ్కు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మొత్తంగా, జూబ్లీహిల్స్లో క్షేత్రస్థాయి ప్రచారం వేగవంతం చేయాలని, హస్తం గుర్తుకు ప్రతి ఓటును సమీకరించడానికి శ్రమించాలంటూ సీఎం స్పష్టం చేశారు.